
E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 07-08-2025 (వారం) గురువారం
హైదరాబాద్ పేజీలు–6
e-kaburu.com


ఆ 65 లక్షల ఓటర్ల వివరాలు సమర్పించండి: ఈసీని ఆదేశించిన సుప్రీం
» 2లో

### భారత క్రికెట్ ఎవరి కోసమూ ఆగదు: సౌరభ్ గంగూలీ
» 6లో



### వాట్సప్‌లో సేఫ్టీ ఫీచర్.. గ్రూపులో చేరితే గత చరిత్ర ప్రత్యక్షం!
» 4లో



### రిలేషన్ వార్తల వేళ.. ధనుష్ కుటుంబంతో మృణాల్!
» 5లో



# మరో 25 శాతం సుంకం



- భారత్‌పై ట్రంప్ సుంకాల బాంబు.. ఇప్పటికే ప్రకటించిన 25 శాతానికి అదనం.. మొత్తంగా 50 శాతానికి పెంపు
- వస్త్ర, ఆక్వా, పాదరక్షల పరిశ్రమలకు దెబ్బ!.. అదనపు టారిఫ్ ఈనెల 27వ తేదీ నుంచి అమల్లోకి
- ప్రతీకార సుంకాలు విధిస్తే మరింతగా పెంచుతామని హెచ్చరికలు.. తొలి 25శాతం టారిఫ్ నేటి నుంచే అమల్లోకి
- ఉక్కు, అల్యూమినియం, ఫార్మా ఉత్పత్తులు సహా ఇప్పటికే ఉన్న మినహాయింపులు కొనసాగింపు
- అదనపు సుంకాలు అసమంజసం: భారత్.. మిత్రదేశం భారత్‌ను దూరం చేసుకోవద్దు: నిక్కీ హేలీ
- అదానీపై అమెరికాలో దర్యాప్తు.. అందువల్లే ట్రంప్ బెదిరింపులకు మోదీ దీటుగా స్పందించడం లేదు: రాహుల్

తరువాయి 2లో

## మరణించిన వ్యక్తుల బ్యాంకు ఖాతాల సెటిల్‌మెంట్లు ఇక ఈజీ




» ఈకబురు, ముంబయి: బ్యాంక్ ఖాతాలు, లాకర్లకు సంబంధించిన క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రామాణీకరించనుంది. మరణించిన వ్యక్తుల ఖాతాలు, లాకర్ల విషయంలో నామినీల క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియను సులభతరం చేయనుంది.

తరువాయి 4లో


## చైనా పర్యటనకు ప్రధాని మోదీ షెడ్యూల్ ఖరారు.. గల్వాన్ ఘటన తర్వాత తొలిసారి!



ఈ-కబురు,ఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ త్వరలో చైనాలో పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. తియాంజిన్ వేదికగా ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సదస్సు లో ఆయన పాల్గొననున్నారు. గల్వాన్ ఘటన తర్వాత ప్రధాని మోదీ చైనాలో పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి.

తరువాయి 2లో

### బీసీలకు 42%రిజర్వేషన్లు సాధించి తీరతాం
# మోదీని గద్దె దించుతాం



- రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసుకుంటాం
- తక్కువ అంచనా వేస్తే తడాఖా చూపిస్తాం
- తెలంగాణ ప్రజల శక్తిని, ఉద్యమ స్ఫూర్తిని ప్రధాని మోదీ
- ఇక ఢిల్లీకి రాము.. గల్లీలో బీజేపీ నేతలను పట్టుకుంటాం..
- ఆ పార్టీకి ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ 150 సీట్లు దాటవు
- నాడు కేసీఆర్ చేసిన చట్టమే నేడు గుదిబండగా మారిందన్న సీఎం



ఈకబురు, బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపును ఆమోదించకుంటే రాహుల్‌గాంధీ నేతృత్వంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని గద్దె దించుతామని హెచ్చరించారు. ఎర్ర కోటపై మూడు రంగుల జెండా ఎగురవేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసుకుని బీసీ రిజర్వేషన్ల డిమాండ్‌ను నెరవేర్చుకుంటామని చెప్పారు. తెలంగాణ ప్రజల శక్తిని, ఉద్యమ స్ఫూర్తిని మోదీ తక్కువగా అంచనా వేస్తే తడాఖా చూపిస్తామని అన్నారు. బిల్లులు ఆమోదం పొందే వరకు తాము నిద్రపోమని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదం కోరుతూ ఢిల్లీ జంతర్‌మంతర్‌లో టీపీసీసీ బుధవారం నిర్వహించిన మహాధర్నాలో సీఎం ప్రసంగించారు.

తరువాయి 2లో

# 15 నుంచి స్త్రీశక్తి పథకం

» త్వరలో నేతన్నలకు రూ.25వేలు
» సెలూన్లకు ఉచిత విద్యుత్ మరో 50 యూనిట్ల పెంపు
» నూతన బార్ పాలసీ.. లాటరీ ద్వారా బార్ల కేటాయింపు
» మంత్రివర్గ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి
» నేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్



ఈకబురు,అమరావతి: రాష్ట్రంలోని ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం.. 'స్త్రీశక్తి'ని ఈ నెల 15 నుంచి ఆరంభించడానికి, నేత కార్మికులకు మేలుచేసేలా మూడు పథకాలు గురువారం నుంచే అమలుచేసేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రానికి పెద్దఎత్తున ఐటీ సంస్థలు వచ్చేలా ఏపీ ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్ పాలసీ (4.0)కి ఆమోదం తెలపగా.. దీనికింద ప్రముఖ ఐటీ సంస్థలకు ఎకరా 99 పైసలకే భూములు కేటాయించేలా నిర్ణయించింది. నూతన బార్‌పాలసీ, రోడ్లపై బహిరంగంగా మద్యం తాగకుండా.. మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లకు అనుమతివ్వడం వంటి పలు నిర్ణయాలను మంత్రివర్గం తీసుకుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం బుధవారం జరిగింది.

తరువాయి 3లో

## ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా: కేంద్రమంత్రి బండి సంజయ్
3లో



ఈ కబురు: సహాయమంత్రి బండి సంజయ్ అరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్ కానే కాదు.. ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషనే అని విమర్శించారు. బీసీలకు 5శాతం పెంచి.. ముస్లింలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించే కుట్ర జరుగుతుందన్నారు.

## కాంగ్రెస్ బీసీ సభ.. గాంధీ కుటుంబాన్ని పొగిడేందుకే సరిపోయింది: కిషన్‌రెడ్డి



జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ పెట్టుకున్న సభ.. గాంధీ కుటుంబాన్ని పొగిడేందుకే సరిపోయిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణలో రాజకీయంగా ఎదురవుతున్న ఒత్తిడిని తట్టుకునేందుకు గాంధీ కుటుంబం అనుగ్రహం పొందాలనే లక్ష్యంతో రేవంత్‌రెడ్డి దిల్లీ సభ పెట్టినట్లుగా అర్థమవుతుందన్నారు.
3లో



# ఐక్యంగా పోరాడి.. రిజర్వేషన్లు సాధిస్తాం!

- రాష్ట్రపతి సమయం ఇస్తారని ఆశిస్తున్నాం
- కేంద్రం ఇకనైనా కళ్లు తెరవాలి
- జంతర్‌మంతర్ ధర్నాలో రాష్ట్ర మంత్రులు


తరువాయి 2లో

## పరువునష్టం కేసులో రాహుల్ గాంధీకి బెయిల్ మంజూరు



తరువాయి 2లో

## పుతిన్‌తో ట్రంప్ ప్రత్యేక రాయబారి భేటీ..



తరువాయి 2లో

మొదటి పేజీ తరువాయి

# మరో 25శాతం సుంకం



ఈ కబురు : వాషింగ్టన్/న్యూఢిల్లీ, ఆగస్టు 6: భారత్‌పై దిగుమతి సుంకాలను మరో 25% పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బుధవారం నిర్ణయం తీసుకున్నారు. మొత్తంగా భారత్‌పై సుంకాలను 50 శాతానికి పెంచారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ కొనసాగిస్తున్నందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు. ఒకవేళ భారత్ ప్రతీకార సుంకాలేమైనా విధిస్తే... తమ టారిఫ్‌లను మరింతగా పెంచుతామని హెచ్చరించారు. '24 గంటల్లో భారత్‌పై సుంకాలు పెంచుతాన'ంటూ మంగళవారం ప్రకటించిన ట్రంప్.. అన్నట్టుగానే బుధవారం సుంకాల పెంపు ఉత్తర్వులపై సంతకం చేశారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే ఇప్పటికే విడిగా సుంకాలను నిర్ధారించిన ఉక్కు, అల్యూమినియం, ఫార్మా వంటి ఉత్పత్తులపై మినహాయింపులు కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుండటంతో ఉక్రెయిన్‌పై యుద్ధం కోసం రష్యాకు నిధులు సమకూరుతున్నాయని ట్రంప్ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జూలై 30న భారత్‌పై 25శాతం సుంకాలను విధించారు. అవి ఆగస్టు 7వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. రష్యా చమురు కొనుగోళ్లపై భారత్ వెనక్కి తగ్గకపోవడం, రష్యాతో యూరోపియన్ యూనియన్, అమెరికా కూడా వాణిజ్యం జరుపుతుండటాన్ని భారత్ ఎత్తిచూపడంతో.. మరో 25శాతం కలిపి 50శాతం సుంకాలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా ఉత్పత్తులపై ఇప్పటికే ఉన్న సుంకాలకు ఈ 50 శాతం అదనం కావడం ఆందోళనకరం. కాగా.. భారత్, పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ ట్రంప్ మరోసారి వ్యాఖ్యలు చేశారు. 2028లో అమెరికాలోని లాస్‌ఏంజిలిస్‌లో జరిగే ఒలింపిక్స్‌కు సంబంధించి మీడియా సమావేశం ఏర్పాటు చేసిన ట్రంప్.. "రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఆపడానికి గట్టిగా ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే గత ఐదు నెలల్లో.. భారత్, పాక్ యుద్ధం సహా ఐదు యుద్ధాలను ఆపాను. ఇది ఆరోది అవుతుంది.." అని పేర్కొన్నారు. మరోవైపు ప్రస్తుత ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 2028లో జరిగే ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా నిలిచే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఆయనతో పాటు విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడే అవకాశం ఉందని చెప్పారు. అమెరికాలో నిబంధనల ప్రకారం.. ఎవరైనా సరే రెండుసార్లకు మించి అధ్యక్షుడు కావడానికి వీల్లేదు. ప్రస్తుతం రెండోసారి అధ్యక్షుడిగా ఉన్న ట్రంప్ మళ్లీ పోటీ చేయలేరు. మరో అభ్యర్థిని రిపబ్లికన్ పార్టీ తరఫున రంగంలోకి దింపాల్సిందే.

**ఇది ఆర్థిక బ్లాక్ మెయిలింగ్: రాహుల్**

ట్రంప్ సుంకాల పెంపు భారత్‌పై ఆర్థిక బ్లాక్ మెయిలింగ్ అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. అసమంజసమైన వాణిజ్య ఒప్పందం దిశగా భారత్‌ను నెట్టే ప్రయత్నమని విమర్శించారు. ప్రధాని మోదీ తన బలహీనతలను అధిగమించి అయినా.. భారత ప్రయోజనాలను దెబ్బతీసే ఈ చర్యను అడ్డుకోవాలంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ట్రంప్ పదే పదే బెదిరింపులు చేస్తున్నా ప్రధాని మోదీ దీటుగా స్పందించడం లేదని... అదానీ వ్యవహారంపై అమెరికాలో దర్యాప్తు జరుగుతుండటమే దీనికి కారణమని రాహుల్ ఆరోపించారు.

**మోదీతోనే మాట్లాడుతా: డసిల్వా**

తమ దేశంపై సుంకాలకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో తాను మాట్లాడే ప్రసక్తే లేదని బ్రెజిల్ అధ్యక్షుడు ఇనాసియో లులా డసిల్వా స్పష్టం చేశారు. ఇటీవల బ్రెజిల్‌పై సుంకాలు విధిస్తూ, ఆ దేశ అధ్యక్షుడు తనతో ఎప్పుడైనా చర్చించవచ్చని ట్రంప్ ప్రకటించడంపై డసిల్వా స్పందించారు. "సుంకాలపై చర్చించేందుకు నేను ట్రంప్‌కు కాల్ చేసి మాట్లాడే ప్రసక్తే లేదు. ఆయన మేం చెప్పేది వినరు. దానికి బదులు భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో మాట్లాడుతాను.

**అదనపు సుంకాలు అసమంజసం: భారత్**

సుంకాల పెంపు పూర్తిగా అసమంజసం, అన్యాయమని అమెరికాకు భారత్ స్పష్టం చేసింది. ఈ అంశంలో దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా తగిన చర్యలు చేపడతామని స్పష్టం చేసింది. భారత్‌పై 25శాతం అదనపు సుంకాలు విధిస్తూ ట్రంప్ ఉత్తర్వులు జారీ చేయడంపై.. మన విదేశాంగ శాఖ స్పందించింది. "రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులను అమెరికా కొన్ని రోజులుగా టార్గెట్ చేస్తోంది. ఈ అంశంపై మేం ఇప్పటికే మా వైఖరిని స్పష్టం చేశాం. 140 కోట్ల మంది దేశ ప్రజలకు ఇంధన భద్రత కోసం మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మా చమురు దిగుమతులు ఉన్నాయి. ఇతర దేశాలు వారి జాతీయ ప్రయోజనాల కోసం చేపట్టిన చర్యలకు సంబంధించి.. భారత్‌పై అదనపు సుంకాలు విధించాలని అమెరికా నిర్ణయించడం తీవ్ర దురదృష్టకరం. ఇది పూర్తిగా అన్యాయం, అసమంజసం. జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా అవసరమైన అన్ని చర్యలను భారత్ చేపడుతుంది" అని ప్రకటించింది.

**వస్త్ర, ఆక్వా పరిశ్రమలకు దెబ్బ!**

ట్రంప్ అదనంగా విధించిన సుంకాల ప్రభావం భారత్‌పై గణనీయంగానే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రస్తుత పెంపుతో కలిపి గంపగుత్తగా 50 శాతం సుంకాలు వర్తించే కొన్ని రంగాలపైనే అధిక ప్రభావం ఉంటుందని.. నిర్దేశిత టారిఫ్‌లు ఉన్న రంగాలకు ఇబ్బంది రాకపోవచ్చని అంటున్నారు. గంపగుత్త సుంకాలు వర్తించే ఉత్పత్తుల్లో.. వస్త్రాలు, రొయ్యలు ఇతర ఆక్వా ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలు, తోలు ఉత్పత్తులు, పాదరక్షలు, జంతు ఉత్పత్తులు, రసాయనాలు, ఎలక్ట్రిక్, మెకానికల్ యంత్రాలు ఉన్నాయి. ఉత్పత్తులను బట్టి నిర్దేశిత సుంకాలు (10 శాతం, 15 శాతం, 30 శాతం.. ఇలా) వర్తించేవాటిలో... చమురు, పెట్రోలియం ఉత్పత్తులు, బొగ్గు, కీలక ఖనిజాలు, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, స్క్రీన్లు, హార్డ్ డిస్కులు వంటి ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు ఉన్నాయి. ఇందులో గంపగుత్త సుంకాలు వర్తించే భారత ఉత్పత్తుల ధరలు అమెరికాలో పెరిగిపోతాయి. తక్కువ సుంకాలున్న దేశాల నుంచి వచ్చే ఇవే ఉత్పత్తులు తక్కువ ధరకే లభిస్తాయి. దీనితో భారత ఎగుమతులపై ప్రభావం పడుతుంది. ఉదాహరణకు భారత్‌పై 50 శాతం సుంకం వల్ల.. అమెరికాలో మన వస్త్రాల ధరలు ఒక్కసారిగా 50శాతం పెరుగుతాయి. అంటే ఇప్పటివరకు 20 డాలర్లకు దొరికే భారత టీషర్టు ధర 30 డాలర్లు అవుతుంది. అదే ఫిలిప్పీన్స్, వియత్నాంలపై 20శాతమే సుంకం వల్ల.. ఆ దేశాల నుంచి వచ్చే అదేస్థాయి టీషర్టు ధర 20 డాలర్ల నుంచి 24 డాలర్లకు మాత్రమే పెరుగుతుంది. ధర ఎక్కువగా ఉండటంతో భారత ఉత్పత్తులకు డిమాండ్ తగ్గి.. ఇక్కడి నుంచి ఎగుమతులు తగ్గిపోతాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే రొయ్యల ధర పరిస్థితి కూడా ఇలాగే ఉండనుంది. ప్రస్తుతం అమెరికా టారిఫ్‌లు మలేసియాపై 25శాతం, చైనా, శ్రీలంకలపై 30శాతం, ఇండోనేషియాపై 32, బంగ్లాదేశ్‌పై 35శాతం, థాయ్‌లాండ్, కాంబోడియాలపై 36 శాతం, మయన్మార్‌పై 40శాతంగా ఉన్నాయి. దీనితో అమెరికాలో ఆయా దేశాల ఉత్పత్తుల కంటే భారత ఉత్పత్తుల ధర ఎక్కువగా ఉండే అవకాశముంది. ట్రంప్ సుంకాల నిర్ణయం షాక్‌కు గురిచేసిందని, దీనివల్ల దాదాపు 55శాతం భారత ఎగుమతులపై ప్రభావం పడుతుందని 'భారత ఎగుమతి సంస్థల ఫెడరేషన్ (ఎఫ్ఐఈఓ)' ప్రకటించింది. వస్త్ర పరిశ్రమ, ఆక్వా, తోలు ఉత్పత్తులు, పాదరక్షలు, రసాయనాలు, యంత్ర పరికరాల పరిశ్రమలకు దెబ్బతగులుతుందని పేర్కొంది. అమెరికా సుంకాల ప్రభావం భారత్‌లో ద్రవ్యోల్బణంపై తీవ్ర ప్రభావమేమీ చూపుతుందని భావించడం లేదని రిజర్వు బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. భారత్ ప్రతీకార సుంకాలు విధిస్తే.. ఏదైనా ప్రభావం పడే అవకాశం ఉందని, కానీ ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదని చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

## ఐక్యంగా పోరాడి.. రిజర్వేషన్లు సాధిస్తాం!



ఈకబురు,బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఐక్యంగా పోరాడి సాధించుకుందామని తెలంగాణ రాష్ట్ర మంత్రులు పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటోందని మండిపడ్డారు. మహాధర్నాలో వారు మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు బీసీల రిజర్వేషన్లకు అడ్డుతగులుతున్నాయని ఆరోపించారు. "రాష్ట్రపతిని సమయం అడిగి చాలారోజులవుతోంది. ఆమె సమయం ఇస్తారని ఆశిస్తున్నాం. బీసీలకు రిజర్వేషన్లు దక్కాలంటే రాజ్యాంగ సవరణ కావాలి. బీసీలపై బీజేపీకి ఎందుకింత అక్కసో అర్థం కావడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్‌ఎస్ బీసీల కోసం మొసలి కన్నీరు కార్చింది. ఇప్పుడు రిజర్వేషన్ల కోసం చట్టాన్ని చేస్తే మాతో కలిసి రావట్లేదు" అని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. "బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాం. కానీ, నాలుగు నెలలుగా ఈ ఫైల్ రాష్ట్రపతి వద్దే ఉంది. ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మెడలు వంచైనా రిజర్వేషన్లు సాధిస్తాం" అని మంత్రి ఉత్తమ్ చెప్పారు

**ఐక్య పోరాటాలు చేద్దాం: పొన్నం**

"బీసీ రిజర్వేషన్లు తెలంగాణకే పరిమితం కాదు. ఇది దేశవ్యాప్తంగా ఎన్నో కోట్లమంది కల. బీసీలకు రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కాదు. 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఐక్యంగా పోరాటాలు చేద్దాం" అని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. "బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీ నడిబొడ్డున ఇంత పెద్ద ధర్నా జరుగుతుంటే.. కేంద్రం మాత్రం తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఇది ముమ్మాటికీ బీసీలపై చిన్నచూపే. రాజకీయాలకు అతీతంగా అసెంబ్లీలో మద్దతు లభించింది. బీసీల ఆవేదనను అర్థం చేసుకొని, కేంద్రం కళ్లు తెరవాలి" అని మంత్రి దామోదర అన్నారు.

## తెలంగాణ నుంచి బియ్యం, వడ్లు సరఫరా చేయండి



ఈకబురు,ఢిల్లీ: రాబోయే సంవత్సరంలో ఫిలిప్పీన్స్‌కి 20 లక్షల టన్నుల బియ్యం, వడ్లు అవసరమని, ఆమేరకు సరఫరా చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సహకరించాలని ఫిలిప్పీన్స్ వ్యవసాయశాఖ మంత్రి ఫ్రాన్సిస్కో పి.టియు లారెల్ జూనియర్ పేర్కొన్నారు. ఆయన బుధవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమావేశమయ్యారు. తెలంగాణ బియ్యం నాణ్యత బాగున్నాయని, అక్కడి నుంచి బియ్యం, వడ్లను దిగుమతి చేసుకోవాలని ఆసక్తితో ఉన్నామని ఫ్రాన్సిస్కో పేర్కొన్నారు. అందుకు ఉత్తమ్ సుముఖత వ్యక్తం చేశారు. తెలంగాణ బియ్యం నాణ్యతను అభినందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణఫిలిప్పీన్స్ మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ ఏడాది చివర్లో రాష్ట్రంలో పర్యటించాలని ఫ్రాన్సిస్కోను ఆహ్వానించగా... తమ దేశానికి రావాలని ఉత్తమ్‌ని ఆయన కోరారు. తెలంగాణ నుంచి మొక్కజొన్న దిగుమతి చేసుకోవడానికీ ఫిలిప్పీన్స్ వ్యవసాయ మంత్రి ఆసక్తి చూపారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

## బీసీలకు 42% రిజర్వేషన్లు సాధించి తీరతాం

# మోదీని గద్దె దించుతాం

**సామాజిక న్యాయాన్ని వ్యతిరేకిస్తే అదే మరణ శాసనం**

'గోద్రా అల్లర్ల సమయంలో రాజీనామా చేయమని నాటి ప్రధానమంత్రి వాజ్‌పేయి నాడు సీఎంగా ఉన్న నరేంద్ర మోదీని కోరితే చేయలేదు. 75 ఏళ్లు నిండినందున ప్రధాని పదవి నుంచి వైదొలగాలని ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ కోరుతున్నా ఆయన పట్టించుకోవడం లేదు. మోదీ లేకపోతే బీజేపీకి 150 సీట్లు కూడా రావని ఆయన భక్తుడు నిశికాంత్ దూబే అంటున్నారు. ఈసారి బీజేపీకి ఎట్టి పరిస్థితుల్లోనూ 150 సీట్లు దాటవు. బీసీ రిజర్వేషన్లను మోదీ అడ్డుకుంటే ఆయనను గద్దె దించడం ఖాయం. రిజర్వేషన్ల పెంపు బిల్లులను ఆమోదించకుంటే ఇక ఢిల్లీ రాము.. గల్లీకి వచ్చినప్పుడు బీజేపీ నేతలను పట్టుకుంటాం. ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ వారసునిగా వచ్చిన రాహుల్‌గాంధీ బీసీలకు న్యాయం చేసేందుకు కంకణం కట్టుకున్నారు. సామాజిక న్యాయంపై రాహుల్‌గాంధీ శిలాశాసనానికి వ్యతిరేకంగా వస్తే అదే మరణ శాసనం అవుతుంది..'అని రేవంత్ హెచ్చరించారు.

**బీజేపీకి తెలంగాణ బీసీల అవసరం లేదా?**

'బలహీన వర్గాలపై కక్ష గట్టిన గత ముఖ్యమంత్రి కేసీఆర్ మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా చట్టం చేశారు. నాడు కేసీఆర్ చేసిన చట్టమే నేడు రిజర్వేషన్ల పెంపునకు గుదిబండగా మారింది. తెలంగాణలో బలహీన వర్గాల బిడ్డలు.. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్లు కాకుండా అడ్డుగా ఉన్న చట్టాన్ని తొలగించాలని ఆర్డినెన్స్ చేసి గవర్నర్‌కు పంపినా ఆమోదించడం లేదు. కేసీఆర్‌తో పాటు బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాంచందర్‌రావులు బీసీ రిజర్వేషన్ల పెంపునకు అడ్డుపడుతున్నారు. రాష్ట్ర బీజేపీ నేతలకు తెలంగాణ బీసీల అవసరం లేదా? బీఆర్‌ఎస్ నాయకులు బీసీ రిజర్వేషన్ల పెంపు ధర్నాకు ఎందుకు రాలేదు? తెలంగాణతో పేరు బంధంతో పాటు పేగు బంధం కూడా తెంచుకుందా?

**ఆ అదృష్టం నాకు దక్కింది**

'దేశంలో వందేళ్ల కాలంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేయలేదు. ఇప్పటివరకు దేశంలో 300 మంది ముఖ్యమంత్రులైనా ఎవరూ చేయని పనిని చేసే అదృష్టం నాకు దక్కింది. బీసీల రిజర్వేషన్లు పెంచే అవకాశం నాకు వచ్చింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకే ఢిల్లీలో ధర్నాకు దిగాం. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైనా సాధించి తీరతాం..'అని ముఖ్యమంత్రి అన్నారు.

**కేటీఆర్ బుద్ధి మారలేదు.. అహంకారం తగ్గలేదు**

బీసీ రిజర్వేషన్ల పెంపు ధర్నాను కేటీఆర్ డ్రామా అంటున్నారు. కానీ కేటీఆర్ పేరే డ్రామారావు. కేసీఆర్ కుటుంబం డ్రామాలతో బతుకుతోంది. అధికారం, పదవులు పోయినా కేటీఆర్ బుద్ధి మారలేదు.. అహంకారం తగ్గలేదు. ఆ కుటుంబంలోనే ఒకరు రిజర్వేషన్లకు అనుకూలం.. మరొకరు ప్రతికూలం.. మరొకరు అటూఇటూ కాకుండా మాట్లాడుతున్నారు..'అని సీఎం ధ్వజమెత్తారు.



మొదటి పేజీ తరువాయి

## ఆ 65 లక్షల ఓటర్ల వివరాలు సమర్పించండి: ఈసీని ఆదేశించిన సుప్రీం

**ఈ-కబురు, బిహార్‌లో ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా నుంచి 65 లక్షల మంది ఓటర్లను తొలగించామని పేర్కొంటూ ఎన్నికల సంఘం ఇటీవల ముసాయిదా విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా తొలగించిన ఆ 65 లక్షల ఓటర్ల వివరాలను సమర్పించాలని సుప్రీంకోర్టు ఈసీని ఆదేశించింది. ఇందుకోసం ఈనెల 9 వరకు గడువు ఇచ్చింది. బిహార్‌లో ఈసీ ఓటర్ల ప్రత్యేక సవరణను నిర్వహించడాన్ని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ అనే ఎన్‌జీవో గతంలో సుప్రీంలో సవాల్ చేసింది. ఈసీ ముసాయిదా విడుదల నేపథ్యంలో తొలగించిన ఓటర్ల వివరాలు వెల్లడించాలంటూ మరో దరఖాస్తు దాఖలు చేసింది. దీనిపై అత్యున్నత న్యాయస్థానంలో బుధవారం విచారణ జరగ్గా.. ఇప్పటికే రాజకీయ పార్టీలకు వివరాలను సమర్పించిన నేపథ్యంలో ఎన్‌జీవోకు కూడా వాటిని అందించాలని ఆదేశించింది. రాజకీయ పార్టీలకు జాబితా ఇచ్చినప్పటికీ.. తొలగింపునకు గల కారణాలు తెలపలేదని ఎన్‌జీవో తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ.. ప్రస్తుతం జాబితా వివరాలను మాత్రమే అందిస్తుందని, ఆ తర్వాత కారణాలను వెల్లడిస్తుందని స్పష్టంచేసింది. పరువునష్టం కేసులో రాహుల్‌గాంధీకి బెయిల్ మంజూరు**

**ఈసందర్భంగా పోల్ ప్యానెల్ సిబ్బంది ఓటరు జాబితా నుంచి కొంతమంది ఓటర్లను ఉద్దేశపూర్వకంగా తీసేశారని ఎన్‌జీవో తరఫు న్యాయవాది ఆరోపించారు. ఎస్‌ఐఆర్‌ను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఈనెల 12న విచారిస్తామని, అక్కడ మీ వాదనలను వినిపించవచ్చని న్యాయస్థానం పేర్కొంది. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోన్న వేళ ఈసీ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)ను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ప్రక్రియ పూర్తవడంతో దానికి సంబంధించిన ముసాయిదాను ఇటీవల విడుదల చేసింది. ఇది రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ప్రతిపక్ష పార్టీలు ఈసీ చర్యను తీవ్రంగా తప్పుబడుతున్నాయి.**

## చైనా పర్యటనకు ప్రధాని మోదీ షెడ్యూల్ ఖరారు.. 'గల్వాన్' ఘటన తర్వాత తొలిసారి!


ఈ పర్యటనలో రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో మోదీ ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది కజాన్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అయిన విషయం తెలిసిందే. తొలిసారిగా 2015లో బీజింగ్‌కు వెళ్లిన భారత ప్రధాని.. ఇప్పటివరకు ఐదుసార్లు ఆ దేశంలో పర్యటించారు. 2019లో చివరిసారిగా చైనాలో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్‌చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరిగ్గా ఇటీవలే కొంత పురోగతి కనిపిస్తోంది.చైనాలో ఈ ఏడాది జూన్‌లో జరిగిన 'షాంఘై సహకార సంస్థ' సభ్యదేశాల రక్షణ మంత్రుల సదస్సులో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదం, పహల్గాం ముష్కర దాడులను ప్రస్తావించకపోవడంపై తీవ్రంగా పరిగణించిన భారత్.. ఉమ్మడి ప్రకటనపై సంతకం చేసేందుకు నిరాకరించింది. దీంతో ఎలాంటి ఉమ్మడి ప్రకటన లేకుండానే నాటి చర్చలు ముగిశాయి. అనంతరం జులైలో జరిగిన విదేశాంగ మంత్రుల సదస్సులో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పాల్గొన్న సంగతి తెలిసిందే.

**మరోవైపు భారత్‌పై సుంకాలు విధించిన ట్రంప్.. రష్యాతో ముడిచమురు కొనుగోలును తీవ్రంగా వ్యతిరేకిన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని విధిస్తామంటూ హెచ్చరిస్తున్నారు. ఇదే సమయంలో రష్యా మాత్రం భారత్‌కు మద్దతుగా నిలుస్తోంది. ఇదే సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ భేటీ అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ తాజా పర్యటన ప్రాధాన్యం**



## పుతిన్‌తో ట్రంప్ ప్రత్యేక రాయబారి భేటీ..

# యుద్ధం కొలిక్కి వచ్చేనా?



**ఈ-కబురు, ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపుపై ఓ ఒప్పందానికి రావాలంటూ రష్యాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి తీసుకొస్తున్నారు.**

దీనిపై నిర్ణయం తీసుకోకపోతే పెద్దఎత్తున సుంకాలతో శిక్షిస్తానని హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల మధ్య ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ నేడు మాస్కో వేదికగా రష్యా అధినేత పుతిన్‌తో సమావేశమయ్యారు. ఈ విషయాన్ని క్రెమ్లిన్ వెల్లడించింది. ఒప్పందం విషయంలో పుతిన్‌కు ట్రంప్ విధించిన గడువు శుక్రవారంతో ముగియనున్న నేపథ్యంలో ఈ భేటీ కీలక ప్రాధాన్యం సంతరించుకుంది.2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్ సైతం ఎదురుదాడులు కొనసాగిస్తుండటంతో ఇటీవల కాలంలో యుద్ధం తీవ్రత మరింత ముదిరింది. యుద్ధం ముగింపు విషయంలో ఇస్తాంబుల్ వేదికగా ఇరుదేశాల మధ్య జరిగిన మూడు రౌండ్ల చర్చలు విఫలమయ్యాయి. తాను అధికారంలోకి వస్తే యుద్ధానికి తెరదించుతానని పేర్కొన్న డొనాల్డ్ ట్రంప్.. ఈ మేరకు ప్రయత్నాలు చేస్తున్నారు. యుద్ధం ముగింపుపై తొలుత 50రోజుల్లోపు ఓ ఒప్పందానికి రావాలని రష్యాను హెచ్చరించిన ఆయన.. ఇటీవల ఆ గడువును మరింత తగ్గించారు.

**అర్ధరాత్రి 2 గంటలకు ట్రంప్ కీలక ప్రకటన.. ఏం చెప్పనున్నారు..?**

మరోవైపు.. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 4.30 గంటలకు (భారత్‌లో గురువారం అర్ధరాత్రి 2 గంటలకు) ట్రంప్ ఓవల్ ఆఫీసులో కీలక ప్రకటన చేయనున్నట్లు సమాచారం. ఒకవేళ రష్యా కాల్పుల విరమణకు అంగీకరించకపోతే.. ఆ దేశంపై ఆంక్షలు విధించే అవకాశాలు కన్పిస్తున్నాయి. భారత్‌పైనా సుంకాలు పెంచుతానంటూ ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. తమపై అమెరికా విధించిన అంతర్జాతీయ ఆంక్షలు పరిమిత ప్రభావాన్నే చూపాయని క్రెమ్లిన్ ఇదివరకే స్పష్టం చేసింది. ఉక్రెయిన్ మాత్రం.. ఆంక్షలను మరింత పెంచాలని పాశ్చాత్య మిత్ర దేశాలను కోరుతోంది.

# అంజయ్యనగర్ లో ఇరువర్గాల మధ్య ఘర్షణ

**రాయదుర్గం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు**

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలి అంజయ్య నగర్ భూవివాదాలకు కేంద్రంగా మారుతుంది. ఓవైపు అంజయ్య నగర్ లోని ప్రభుత్వ భూములు, మిగులు స్థలాలు కబ్జాదారులకు ఫలహారంగా మారగా.. మరోవైపు పేదల నివాస స్థలాలే లక్ష్యంగా కబ్జాదారులు దాడులకు తెగబడుతున్నారు. తాజాగా ఓ ఇంటి స్థలం విషయంలో రెండు వర్గాల మధ్య చోటుచేసుకున్న వివాదం అంజయ్య నగర్ లో దాడులకు తెరలేపింది. ఇరువర్గాలు రాళ్లు కర్రలతో దాడులకు దిగడంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో ఇరువైపులా పలువురు గాయపడ్డారు. ఈ ఘర్షణపై సదరు స్థలంలో నివాసం ఉంటున్న వ్యక్తి నుంచి ఫిర్యాదు అందుకున్న రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

గచ్చిబౌలి అంజయ్యనగర్ లోని ప్లాటు నెంబరు 34/136లో ఏం. రామక్రిష్ణ అనే వ్యక్తి గత రెండు దశాబ్దాలుగా నివాసం ఉంటున్నాడు. కాగా గతకొంత కాలంగా సదరు ప్లాటు తమదంటూ కొంతమంది రామక్రిష్టతో గొడవ పడుతున్నారు.




అంజయ్య నగర్ లో దాడులు చేసుకుంటున్న ఇరువర్గాలు

ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం కొందరు వ్యక్తులు రామక్రిష్ణ ఇంటి మీద ఒక్కసారిగా దాడి చేసి విద్యుత్ మీటర్లను ధ్వంసం చేశారు. ప్లాట్ ఖాళీ చేయాలని బెదిరించడంతో విషయం గమనించిన స్థానికులు రామక్రిష్ణకు మద్దతుగా నిలిచారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడడంతో స్థానికంగా భయానక వాతావరణం ఏర్పడింది. కాగా షానవాజ్, సర్పరాజ్ అనే వ్యక్తులు తన ఇల్లు ఖాళీ చేయాలని భయపెడుతున్నారని రామకృష్ణ వాపోయాడు. బుధవారం దాదాపు 30మంది అనుచరులతో వచ్చి తనను చంపుతామని బెదిరిండంతో పాటు తన కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారని రామక్రిష్ణ రాయదుర్గం పోలీసులకు పిర్యాదు చేశాడు. తన ఇంట్లో ఉన్న విద్యుత్ మీటర్లను ధ్వంసం చేశారని తెలిపాడు. ఈ పిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న రాయదుర్గం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



అంజయ్య నగర్ లో దాడులు చేసుకుంటున్న ఇరువర్గాలు

# పరువునష్టం కేసులో రాహుల్‌గాంధీకి బెయిల్ మంజూరు



ఈ-కబురు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసు లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కి ఊరట లభించింది. ఆరేళ్ల క్రితం నాటి ఈ కేసులో ఝార్ఖండ్‌లోని ప్రజాప్రతినిధుల కోర్టు తాజాగా బెయిల్ మంజూరు చేసింది. ఝార్ఖండ్ హైకోర్టు ఆదేశాల మేరకు రాహుల్ గాంధీ కోర్టుకు హాజరయ్యారని రాహుల్ తరపు న్యాయవాది మీడియాకు వెల్లడించారు. న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరుచేసిందని.. ఈ విషయాన్ని తాము మరింత ముందుకుతీసుకువెళ్తామని అన్నారు.

2018లో ఝార్ఖండ్‌లోని చైబాసా ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్.. కేంద్రమంత్రి అమిత్ షాపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో అమిత్ షా.. భాజపా జాతీయాధ్యక్షుడిగా ఉన్నారు. ఈ వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ క్రమంలోనే ప్రతాప్ కుమార్ అనే వ్యక్తి చైబాసాలోని మేజిస్ట్రేట్ కోర్టులో రాహుల్ గాంధీపై పరువు నష్టం కేసు దాఖలు చేశారు. ఆయన ప్రకటనలు అమిత్ షా ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయని ఆరోపించారు. ఈ కేసుపై నేడు విచారణ జరిపిన ప్రజాప్రతినిధుల కోర్టు రాహుల్‌కు బెయిల్ మంజూరు చేసింది.

# తుది శ్వాస వరకు తెలంగాణ కోసం తపించిన యోధుడు జయశంకర్ : సాయిబాబా

**ఖాజాగూడలో ప్రొఫెసర్ జయశంకర్ కు ఘన నివాళి**



ప్రొఫెసర్ జయశంకర్ కు నివాళులర్పిస్తున్న సాయిబాబా, బిఆర్ఎస్ నాయకులు



ప్రొఫెసర్ జయశంకర్ కు నివాళులర్పిస్తున్న సాయిబాబా, బిఆర్ఎస్ నాయకులు

ఈకబురు, శేరిలింగంపల్లి : తన తుది శ్వాస వరకు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పరితపించిన యోధుడు ప్రొఫెసర్ జయశంకర్ అని శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ 91వ జయంతిని పురస్కరించుకొని గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఖాజాగూడ టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొమిరిశెట్టి సాయిబాబా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం సాయిబాబా మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర తొలి తరం ఉద్యమకారులు ప్రొఫెసర్ జయశంకర్ అని అన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమ బాట పట్టిన కేసీఆర్ కు మార్గదర్శకుడిగా జయశంకర్ నిలిచారని తెలిపారు. సమైక్య ఆంధ్ర ప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని ఎలుగెత్తి నినదించారని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధన కోసం నేటి యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చెన్నం రాజు, రాగం జంగయ్య యాదవ్ , దారుగుపల్లి నరేష్, అంజమ్మ , జగదీశ్ ,ఆకుల యాదగిరి, శామ్లెట్ శ్రీనివాస్ మధు, అజీమ్ ,ఖాదర్ ఖాన్ , వెంకట్ రెడ్డి ,సురేష్ ,తాహెర్ ,బురాన్ ,బాలామని తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# 15 నుంచి స్త్రీశక్తి పథకం



ఈకబురు,అమరావతి: రాష్ట్రంలోని ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం.. 'స్త్రీశక్తి'ని ఈ నెల 15 నుంచి ఆరంభించడానికి, నేత కార్మికులకు మేలుచేసేలా మూడు పథకాలు గురువారం నుంచే అమలుచేసేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రానికి పెద్దఎత్తున ఐటీ సంస్థలు వచ్చేలా ఏపీ ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్ పాలసీ (4.0)కి ఆమోదం తెలపగా.. దీనికింద ప్రముఖ ఐటీ సంస్థలకు ఎకరా 99 పైసలకే భూములు కేటాయించేలా నిర్ణయించింది. నూతన బార్‌పాలసీ, రోడ్లపై బహిరంగంగా మద్యం తాగకుండా.. మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లకు అనుమతివ్వడం వంటి పలు నిర్ణయాలను మంత్రివర్గం తీసుకుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం బుధవారం జరిగింది. ఇందులో తీసుకున్న నిర్ణయాలను సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. అవి..
కుటుంబానికి నెలకు రూ.వెయ్యి మిగులుమహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకానికి 'స్త్రీశక్తి' అనే పేరుకు ఆమోదం. మంత్రి లోకేశ్ చొరవతోనే రాష్ట్ర స్థాయిలో ఐదురకాల బస్సుల్లో అమలుకానుంది. ఒక్కో కుటుంబానికి నెలకు రూ.వెయ్యి మిగులు. ఆటోడ్రైవర్లకు సాయం చేయడంపై.. సంబంధిత సంఘాలతో చర్చించాలని సీఎం సూచించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం నుంచి మూడు పథకాల అమలుకు నిర్ణయం. నేతమగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్. సొసైటీల నుంచి ఆప్కో కొనేవాటికి జీఎస్టీపై 5% రాయితీ అమలు. చేనేత సహకార పరపతిసంఘాల త్రిఫ్ట్‌ఫండ్ ఏర్పాటు. నేతన్నల అన్ని పథకాలకు ప్రభుత్వం రూ.648.59 కోట్లు కేటాయించింది. నేతన్న భరోసా కింద రూ.25వేల సాయం. హెయిర్ కటింగ్ సెలూన్లు నిర్వహించే నాయీబ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ నెలకు 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచుతూ నిర్ణయం. 40,808 సెలూన్ల నిర్వాహకులకు లబ్ధి.ఐటీ సంస్థలను రప్పించేలా..: రాష్ట్రానికి పెద్దఎత్తున ఐటీ సంస్థలు తరలివచ్చేలా ఏపీ ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్‌హబ్ పాలసీ (4.0) 202429కి ఆమోదం. ఫార్చ్యూన్500 యూరప్, గ్లోబల్, ఫోర్బ్స్ గ్లోబల్ జాబితాలో ఉన్న ప్రముఖ ఐటీ సంస్థలు.. ఐటీ, ఐటీఈఎస్, గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు ఏర్పాటుచేసేందుకు ఎకరా 99 పైసలతో భూములు కేటాయింపు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి.. ఇలా ఎక్కడైనా భూములు.లాటరీ విధానంలో బార్ల కేటాయింపు: 202528 బార్ పాలసీకి ఆమోదం. 840 బార్లను లాటరీ విధానంలో కేటాయిస్తారు. ఒక్కో బార్‌కి కనీసం నాలుగు దరఖాస్తులు రావాలి. బార్లలో 10% కల్లుగీత కులాల వారికి కేటాయింపు. 50వేల వరకు జనాభా ఉన్నచోట్ల రూ.35లక్షలు, 50వేల నుంచి 5 లక్షలలోపు జనాభా ఉంటే రూ.55 లక్షలు, 5 లక్షలకు పైగా జనాభా ఉంటే రూ.75లక్షలు లైసెన్స్ ఫీజుగా నిర్ణయం. గీతకులాలకు కేటాయించే బార్లకు 50 శాతమే ఫీజు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్వహణకు అనుమతి. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంతో శాంతిభద్రతల సమస్యలు తలెత్తి, 2.7లక్షల కేసులు నమోదయ్యాయి. వీటిని నియంత్రించేందుకు పర్మిట్ రూమ్‌లకు అనుమతిచ్చేలా నిర్ణయం.పాఠశాలలు, ఉపాధ్యాయుల పోస్టుల హేతుబద్ధీకరణగత ప్రభుత్వం జీఓ 117 ద్వారా.. 4,731 బడులను రీస్ట్రక్చర్ చేసి, 35 తరగతుల విద్యార్థులను సమీప హైస్కూళ్లలో కలిపేసింది. దీనివల్ల 2.5 లక్షల మంది విద్యార్థులపై ప్రభావం పడింది. జీవో 117ను రద్దుచేసి, పిల్లలను వెనక్కి తీసుకొచ్చాం. పాఠశాలలు, టీచర్ పోస్టులను హేతుబద్ధీకరించి పదోన్నతులు కల్పించాం. 9రకాల పాఠశాలల విధానాన్ని ప్రవేశపెట్టాం. వీటిపై ఇచ్చిన జీవోలను మంత్రివర్గం ర్యాటిఫై చేసింది.
పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన 22 హోటళ్లు, రిసార్టుల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు 33 ఏళ్లపాటు లీజు ప్రాతిపదికన అప్పగించాలని నిర్ణయం. కనీసం మూడు నగరాల్లో రిసార్ట్స్, స్టార్‌హోటళ్లు నిర్వహిస్తున్నవాళ్లు, త్రీ స్టార్, అంతకంటే ఎక్కువ రేటింగ్ ఉన్న హోటళ్ల నిర్వాహకులకే అవకాశం కల్పిస్తాం.

**వై.రామవరం మండలం రెండుగా: అల్లూరి సీతారామరాజు జిల్లాలో వై.రామవరం మండలాన్ని ఎగువ వై.రామవరం, దిగువ రామవరం మండలాలుగా విభజించేలా ప్రాథమిక నోటిఫికేషన్ జారీకి అనుమతి.**

# ఓ జర్నలిస్టు రాసిన ఆర్టికల్ తోనే బ్లడ్ బ్యాంకు పెట్టాలనే ఆలోచన వచ్చింది : మెగాస్టార్ చిరంజీవి



రక్తదానం చేస్తున్న వారితో మాట్లాడుతున్న మెగాస్టార్ చిరంజీవి

**మాదాపూర్ మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న చిరంజీవి**

ఈకబురు, శేరిలింగంపల్లి : ఒక జర్నలిస్టు రాసిన ఆర్టికల్ చదివిన తరువాతే తనకు బ్లడ్ బ్యాంకు పెట్టాలనే ఆలోచన వచ్చిందని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. సదరు ఆర్టికల్ రాసిన జన్నలిస్టును తాను ఇప్పటి వరకు కలువలేదని, కానీ తనను ఎప్పుడూ గుర్తు చేసుకుంటానని అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఫినిక్స్ పౌండేషన్, చిరంజీవి చారిటబుల్ ట్రస్టులు సంయుక్తంగా మాదాపూర్ లో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం నిర్వహించిన ఈ శిబిరానికి నటుడు తేజా సజ్జా, నటి సంయుక్తలతో కలిసి మెగాస్టార్ చిరంజీవి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం దొరకక 27ఏళ్ల క్రితం అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలుసుకొని, ఎందుకు రక్తం దొరకడం లేదనే ఆలోచన తనలో మొదలైందన్నారు. అభిమానుల్ని రక్తదానం వైపు మళ్లిస్తే ఓ సామాజిక సేవ వైపు నడిపించినట్టు అవుతుందని భావించినట్లు తెలిపారు. ఇదే ఉద్దేశ్యంతో నాడు రక్తదానం కోసం పిలుపునిచ్చానని. ఆ పిలుపే నేడు లక్షల మందిని రక్తదానం వైపు కదిలించిందన్నారు. రక్తదానం అనగానే తనపేరు గుర్తుకురావడం తనకు దేవుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తానని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు ఎవరు చేసినా, ఎప్పుడు చేసినా తనను పిలవాలని, తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. రక్తదానం ఒకరి ప్రాణాన్ని నిలబెడుతుందని, ఈ విషయం తాను ఎన్నోసార్లు చెప్పినా నేటి యువత కోసం మరోసారి చెప్పాల్సిన అవశ్యకత ఉందన్నారు. శిభిరంలో పాల్గొన్న హీరో తేజా సజ్జా రక్తదానం చేశారు. ఈ శిబిరంలో 800మంది పాల్గొని రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని భారత ఆర్మీకి డొనేట్ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీనిక్స్ గ్రూప్ చైర్మన్ సురేష్ చుక్కపల్లితో పాటు ఫినిక్స్, చిరంజీవి చారిటబుల్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న నటుడు తేజా సజ్జా

# ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా: కేంద్రమంత్రి బండి సంజయ్

ఈ కబురు: దిల్లీ: సహాయమంత్రి బండి సంజయ్ అరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్ కానే కాదు.. ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషనే అని విమర్శించారు. బీసీలకు 5శాతం పెంచి.. ముస్లింలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించే కుట్ర జరుగుతుందన్నారు. బీసీ ముసుగులో ముస్లింలకు 100శాతం రిజర్వేషన్లను అమలు చేసే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ధర్నాకు బీసీల మద్ధతు కరవైందని ఎద్దేవా చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తేనే మద్దతిస్తామని స్పష్టం చేశారు. బీసీలకు ఏ పార్టీ ఏం చేసిందో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎప్పుడైనా బీసీని ప్రధాని చేశారా అని ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీలో 48 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీనైనా సీఎం చేశారా? చెప్పాలన్నారు. రాష్ట్ర కేబినెట్ లో, నామినేటెడ్ పదవులను ఎంతమంది బీసీలకు ఇచ్చారో చర్చిద్దామా అన్నారు. ఎంతమంది బీసీలకు ఎంపీ సీట్లు ఇచ్చారో సమాధానమివ్వగలరా? అని ప్రశ్నించారు. మీరా.. బీసీల గురించి మాకు నీతులు చెప్పేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీని ప్రధాని చేసిన ఘనత భాజపాదేనన్నారు. 27 మంది బీసీ కేంద్ర మంత్రులను, అనేక రాష్ట్రాలకు బీసీ సీఎంలను నియమించిన ఘనత భాజపాకే దక్కుతుందన్నారు. కేంద్రంపై నెపం మోపి బీసీ రిజర్వేషన్ల నుంచి తప్పుకోవాలనుకుంటున్న కాంగ్రెస్.. యూపీ, బెంగాల్, బిహార్ తరహాలో తెలంగాణలోనూ కనుమరుగవడం తథ్యమని హెచ్చరించారు.



# కాంగ్రెస్ బీసీ సభ.. గాంధీ కుటుంబాన్ని పొగిడేందుకే సరిపోయింది: కిషన్‌రెడ్డి



జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ పెట్టుకున్న సభ.. గాంధీ కుటుంబాన్ని పొగిడేందుకే సరిపోయిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణలో రాజకీయంగా ఎదురవుతున్న ఒత్తిడిని తట్టుకునేందుకు గాంధీ కుటుంబం అనుగ్రహం పొందాలనే లక్ష్యంతో రేవంత్‌రెడ్డి దిల్లీ సభ పెట్టినట్లుగా అర్థమవుతుందన్నారు. దిల్లీలో కాంగ్రెస్ బీసీ ధర్నాపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తాజాగా స్పందించారు.“31 నిమిషాల రేవంత్‌రెడ్డి ప్రసంగంలో 50 శాతానికంటే ఎక్కువ సమయం రాహుల్, సోనియా జపం చేయడానికే సరిపోయింది. బీసీ రిజర్వేషన్లు ఇస్తామని తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారు. దాన్ని పూర్తి చేసుకోవాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్‌దే. అందుకోసం న్యాయపరమైన, చట్టపరమైన అంశాలపై దృష్టి సారించి, చిత్తశుద్ధితో పని చేయాలి తప్ప.. భాజపాపై నెపం నెట్టేస్తామంటే చూస్తూ ఊరుకోం. ముస్లింలతో కూడిన బీసీ రిజర్వేషన్లను భాజపా అంగీకరించదు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాక్షేత్రంలో వ్యతిరేకత బయటపడుతుందని గ్రహించి రిజర్వేషన్ల పేరుతో డ్రామాలు ఆడుతున్నారు. మీకు బీసీలకు సాధికారత కల్పించే విషయంలో చిత్తశుద్ధి లేదనేది బీసీ సమాజానికి అర్థమైంది. అక్కడ ధర్నా చేస్తే ఎవరూ పట్టించుకోరని.. దిల్లీకి వచ్చి నాటకాలు వేస్తున్నారు. కేంద్రంలో అధికారం కోసం కాంగ్రెస్ పగటి కలలు కంటోంది. మోదీ నేతృత్వంలో సుస్థిరమైన పాలన అందుతోంది. వచ్చే 30 ఏళ్ల వరకు కాంగ్రెస్ కేంద్రంలో అధికారం గురించి ఆలోచించడం మానుకోవడం ఉత్తమం”అని కిషన్‌రెడ్డి అన్నారు.

# ఆర్‌బీఐ వడ్డీ రేట్లు.. ఈసారి మార్పు ల్లేవ్..!

**ముంబయి:** ఈ ఏడాది ఇప్పటికే వడ్డీ రేట్లపై ట్రిపుల్ బొనాంజా ప్రకటించిన ఆర్‌బీఐ.. ఈసారి మాత్రం ఆచితూచి వ్యవహరించింది. ట్రంప్ టారిఫ్ ప్రకటనలు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో వడ్డీ రేట్ల ను యథాతథంగా 5.5 శాతం వద్దే ఉంచింది. ఈమేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు.



ద్రవ్యోల్బణం అంచనాలకు మించి తగ్గినప్పటికీ.. అమెరికా టారిఫ్‌లపై అనిశ్చితులు ఇంకా తొలగలేదని ఆర్‌బీఐ గవర్నర్ ఈసందర్భంగా పేర్కొన్నారు. అందువల్ల రెపో రేటును యథాతథంగా 5.5 శాతం వద్దే ఉంచాలని ద్రవ్య పరపతి విధాన కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇక, స్థిర విధాన వైఖరిని కమిటీ మరింత కాలం కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు.

**భారత్‌పై సుంకాల బాంబు పేలుస్తా: ట్రంప్**
కాగా.. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ఏడాదిలో ఇప్పటివరకు రెపో రేటు ఒక శాతం వరకు దిగొచ్చింది.

ఆర్‌బీఐ గవర్నర్ ప్రసంగంలోని కీలకాంశాలు..
రుతుపవనాలు సమృద్ధిగా కొనసాగుతున్నందున ఆర్థిక వ్యవస్థలో నూతన ఉత్సాహం రానుంది. సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుండటంతో ద్రవ్యోల్బణం మరింత దిగి రానుంది. ఇది ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమివ్వనుంది.
ప్రస్తుతం ద్రవ్యోల్బణం స్థిరంగా 4శాతం వద్దే ఉంది. 202526 ఆర్థిక సంవత్సరానికి గాను ద్రవ్యోల్బణం 3.1శాతం వరకు దిగి రావచ్చని అంచనా.
కరెంట్ ఖాతా లోటు స్థిరమైన స్థాయిలోనే ఉండే అవకాశం ఉంది. వ్యవస్థలో ద్రవ్యలభ్యత మిగులు స్థాయిలోనే ఉంది.
202526 ఆర్థిక సంవత్సరానికి గానూ వృద్ధి రేటు 6.5శాతంగా నమోదవ్వొచ్చు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వృద్ధికి ఆటంకంగా మారుతున్నప్పటికీ.. భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ముందుకెళ్తోంది. ధరల స్థిరీకరణ కొనసాగుతోంది.
బ్యాంకు లాకర్లలో ఉంచిన వస్తువులు, ఖాతాలకు సంబంధించి క్లెయిమ్ పరిష్కారాన్ని ఆర్‌బీఐ ప్రామాణీకరించనుంది.



# వాట్సప్‌లో సేఫ్టీ ఫీచర్.. గ్రూపులో చేరితే గత చరిత్ర ప్రత్యక్షం!

ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా వినియోగించే మెసేజింగ్ యాప్ వాట్సప్‌లో మరో కొత్త స్కామ్ నివారణ ఫీచర్ అందుబాటులోకి వచ్చింది. 'సేఫ్టీ ఓవర్‌వ్యూ' పేరిట దీన్ని లాంచ్ చేసింది. మీ కాంటాక్ట్ లిస్ట్‌లో లేని, తెలియని వ్యక్తులు మిమ్మల్ని ఏదైనా గ్రూప్‌లో యాడ్ చేసినపుడు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. ఆ గ్రూప్‌నకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలియజేస్తుంది. ఫిషింగ్, స్కామ్‌ల నుంచి ముప్పు నుంచి ఎలా జాగ్రత్తపడాలో అందులో సూచనలు కనిపిస్తాయి. మోసాలు అరికట్టడంలో భాగంగా వాట్సప్ ఆ కోవకు చెందిన 6.8 మిలియన్ ఖాతాలను ఇప్పటికే బ్యాన్ చేసింది. ఈ చర్యల్లో భాగంగానే సేఫ్టీ ఓవర్‌వ్యూ ఫీచర్‌ను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు వాట్సప్ తన బ్లాగ్‌పోస్ట్‌లో పేర్కొంది.
మీకు తెలియని వ్యక్తి మిమ్మల్ని గ్రూప్‌లో చేర్చినపుడు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. ఇందులో మిమ్మల్ని యాడ్ చేసిన వ్యక్తి, గ్రూప్‌ను సృష్టించిన వ్యక్తికి సంబంధించిన సమాచారం, దాంట్లోని మొత్తం సభ్యులు, గ్రూప్‌ను ఏ తేదీన సృష్టించారనేది చూపిస్తుంది. ఈ సమాచారం ఆధారంగా మీరు గ్రూపులో ఉండాలా? లేదా? అనేది నిర్ణయించుకోవచ్చు. అవసరమైతే గ్రూప్‌లో చేరేముందు ప్రీవియస్ చాట్‌ను కూడా చూడొచ్చు. ఇంతకుముందు ఇలా ప్రీవియస్ చాట్‌ను చూసే వెసులుబాటు లేదు. ఎగ్జిట్ అవ్వాలనుకుంటే గ్రూప్‌లో మెసేజ్‌లను చూడకుండానే అవ్వొచ్చు. మీరు గ్రూప్‌లో ఉండాలనుకుంటే మాత్రం చెక్‌మార్క్ చేయాల్సి ఉంటుంది. అప్పటివరకు మెసేజ్ నోటిఫికేషన్లు మ్యూట్‌లోనే ఉంటాయి. స్టాక్ మార్కెట్, క్రిప్టో కరెన్సీల్లో ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించిన పెట్టుబడి చిట్కాలంటూ కొందరు మనల్ని తెలీని గ్రూప్‌లో యాడ్ చేస్తుంటారు. అలాంటి సందర్భాల్లో ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది.
త్వరలో మరో ఫీచర్: కాంటాక్ట్ లిస్ట్‌లో లేని వ్యక్తి మీకు మెసేజ్ చేస్తే హెచ్చరిక వచ్చే విధంగా వాట్సప్ త్వరలో మరో ఫీచర్‌ను తీసుకురానుంది. చాట్‌ను ప్రారంభించడానికి ముందే ఆ వ్యక్తికి సంబంధించి కొంత అదనపు సమాచారాన్ని చూపించే విధంగా దీన్ని రూపొందించనున్నారు. వాట్సప్‌లో జరిగే మోసాలను అరికట్టడమే లక్ష్యంగా కంపెనీ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.




# క్రెడిట్ కార్డ్ రివార్డ్ పాయింట్లు vs క్యాష్‌బ్యాక్.. ఏది మేలు?

**క్రెడిట్ కార్డు తీసుకునేటప్పుడు అది అందించే ప్రయోజనాలను ఎక్కువమంది పరిగణనలోకి తీసుకుంటారు. జాయినింగ్ ఫీజు, వార్షిక ఫీజుతో పాటు ఇతరత్రాలను బేరీజు వేసుకుంటారు. చివరికి తమకు ఎక్కువ ప్రయోజనాలు, ప్రోత్సాహకాలను అందించే కార్డులకే మొగ్గు చూపుతారు. కొన్ని క్రెడిట్ కార్డులు రివార్డు పాయింట్లు ఇస్తే.. మరికొన్ని కార్డులు క్యాష్‌బ్యాక్ ప్రయోజనాలను అందిస్తాయి. మరి రివార్డ్ పాయింట్లతో ఎక్కువ ప్రయోజనమా? క్యాష్ బ్యాక్‌తోనా? ఏ తరహా కార్డు ఎంపిక చేసుకోవాలి?**



క్రెడిట్ కార్డుతో చేసిన కొనుగోళ్లపై మనకు రివార్డు పాయింట్లు అందుతాయి. ఈ పాయింట్లను విమాన టికెట్లు, హోటల్ బుకింగ్స్, గిఫ్ట్ వోచర్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, గ్యాడ్జెట్లు వంటివి కొనుగోలు చేయడానికి ఉపయోగించొచ్చు. కొన్ని కార్డులు నెలంతా ఖర్చు చేసిన మొత్తంలో కొంత శాతం తిరిగి క్యాష్‌బ్యాక్ రూపంలో చెల్లిస్తాయి. ఈ మొత్తాన్ని మీ కార్డు బాకీపై సర్దుబాటు చేయొచ్చు. ఆన్‌లైన్ షాపింగ్‌లో మీరు రూ.10 వేలు ఖర్చు చేస్తే 5 శాతం క్యాష్‌బ్యాక్ కింద రూ.500 మీ కార్డు ఖాతాకు తిరిగి జమవుతుంది. ఆ మొత్తం మినహాయించి క్రెడిట్ కార్డు బిల్లు చెల్లించొచ్చు. మరికొన్ని వాలెట్‌లో నగదు రూపంలో జమ చేస్తాయి.

**రివార్డు పాయింట్లా? క్యాష్‌బ్యాకా?**
క్యాష్‌బ్యాక్ చాలా సౌలభ్యంగా ఉంటుంది. నగదు నేరుగా ఖాతాల్లోకి రావడం వల్ల కేటలాగ్‌లు, గడువు తేదీల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. అదే రివార్డు పాయింట్లయితే.. ప్రయాణం నుంచి గ్యాడ్జెట్‌ల వరకు దేనికోసమైనా వాడొచ్చు. పాయింట్ల విలువ ఒక్కో ప్రొడక్ట్‌కు ఒక్కోలా ఉంటుంది.
క్యాష్‌బ్యాక్ అర్థం చేసుకోవడానికి సులభంగా ఉంటుంది. నగదు నేరుగా మన ఖాతాల్లోకి వస్తుంది. లేదంటే వోచర్‌గా జారీ అవుతుంది. దీనికి గడువు తేదీ అంటూ ఉండదు. రివార్డ్ పాయింట్ల విషయానికొస్తే.. అర్థం చేసుకోవడం కాస్త కష్టంగా ఉంటుంది. రివార్డ్ పోర్టళ్లు, కనీస పాయింట్ థ్రెషోల్డ్‌లు, స్పెసిఫిక్ పార్ట్‌నర్‌లు వంటివి ఉంటాయి. రివార్డు పాయింట్లను గడువు తేదీలోపు వాడకపోతే అవి పనికిరావు.
ఆకర్షణీయమైన రివార్డ్ ఆఫర్లు ఉన్న కార్డులకు వార్షిక ఫీజు ఎక్కువగా ఉంటుంది. నిర్దేశిత ఖర్చు పరిమితులను చేరుకున్నట్లయితే ఈ ఫీజుల నుంచి మినహాయింపు పొందొచ్చు. క్యాష్‌బ్యాక్ కార్డులకు తక్కువ వార్షిక రుసుములు ఉంటాయి. క్యాష్‌బ్యాక్‌కు సంబంధించి కొన్ని కార్డులకు అసలు వార్షిక ఫీజులుండవు. బడ్జెట్‌ను దృష్టిలోపెట్టుకొని ఖర్చు చేసే వారికి క్యాష్‌బ్యాక్ కార్డులు అనుకూలంగా ఉంటాయి.
రివార్డ్ పాయింట్లు ఆఫర్ చేసే కార్డులు ఎక్కువగా ప్రయాణించే వారికి, అధిక మొత్తం ఖర్చు చేసే వారికి, ఆన్‌లైన్ షాపింగ్ వంటివి ఆసక్తి ఉన్నవారికి అనుకూలంగా ఉంటాయి. క్యాష్‌బ్యాక్ కార్డులు మాత్రం రోజువారీ వినియోగానికి, తక్షణ పొదుపునకు ఉత్తమం.
క్యాష్‌బ్యాక్ ఎస్‌బీఐ, స్విగ్గీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్, ఎయిర్‌టెల్ యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ వంటివి క్యాష్ బ్యాక్ అందించే కార్డులకు ఉదాహరణగా చెప్పొచ్చు. చాలావరకు మిగిలిన క్రెడిట్ కార్డులు రివార్డు పాయింట్లను ఆఫర్ చేస్తుంటాయి.
చివరిగా: రివార్డ్ పాయింట్లను ఆఫర్ చేసే కార్డులు, క్యాష్‌బ్యాక్ ఇచ్చే కార్డులు.. రెండింటికీ వాటి ప్రయోజనాలు, పరిమితులు ఉంటాయి. మీరు క్రెడిట్ కార్డు తీసుకునే ముందు వాటికి సంబంధించిన నిబంధనలు, షరతులను పూర్తిగా చదవాలి. మీ అవసరాలకు అనుగుణంగా సరైన కార్డును ఎంచుకోవడం ముఖ్యం.



# మరణించిన వ్యక్తుల బ్యాంకు ఖాతాల సెటిల్‌మెంట్లు ఇక ఈజీ

**ముంబయి:** బ్యాంక్ ఖాతాలు, లాకర్లకు సంబంధించిన క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రామాణీకరించనుంది. మరణించిన వ్యక్తుల ఖాతాలు, లాకర్ల విషయంలో నామినీల క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియను సులభతరం చేయనుంది. మరణించిన వారి బ్యాంకు ఖతాల్లోని నగదు, లాకర్లలోని ముఖ్యమైన వస్తువులను తమ వారికి సులువుగా చేరవేయడమే లక్ష్యంగా ఈ విధానాన్ని మార్చనున్నామని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ నిర్ణయాల వెల్లడి సందర్భంగా ఆయన దీనిపై మాట్లాడారు.
బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్, 1949 ప్రకారం.. మరణించిన వ్యక్తుల ఖాతాల్లోని నగదు, లాకర్లు, సేఫ్ కస్టడీలోని వస్తువులు నామినీకి చెందుతాయి. నామినీ లేదా చట్టబద్ధ వారసులు చేసే క్లెయిమ్‌లను పరిష్కరించడం దీని ఉద్దేశం. ప్రస్తుతం వివిధ బ్యాంకులు వేర్వేరు పద్ధతులు అనుసరిస్తున్నాయి. ఒక్కో బ్యాంక్ వేర్వేరు డాక్యుమెంట్లను అడుగుతున్నాయి. నామినీ లేని ఖాతాల విషయంలో ఒక్కో బ్యాంక్ ఒక్కో పద్ధతిని పాటిస్తున్నాయి. ఇకపై అన్ని బ్యాంకుల్లోనూ ఒకే డాక్యుమెంటేషన్ ప్రక్రియ ఉండడంతో పాటు, ఇది సులువుగా ఉండేలా ముసాయిదా సర్క్యులర్‌ను త్వరలో జారీ చేయనున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ తెలిపారు. దీనిపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. అలాగే, ప్రభుత్వం జారీ చేసే ట్రెజరీ బిల్స్‌లో సిప్ పద్ధతిలో పెట్టుబడులు పెట్టే వెసులుబాటును రిటైల్ డైరెక్ట్ వేదిక ద్వారా రిటైల్ ఇన్వెస్టర్లకు కల్పించనున్నట్లు వెల్లడించారు.

# వీక్లీ కాంట్రాక్టుల నిలిపివేత ప్రచారం ఊహాజనితం: సెబీ ఛైర్మన్

**ఇంటర్నెట్ డెస్క్:** స్టాక్ మార్కెట్‌లో స్పెక్యులేషన్‌ను నియంత్రించేందుకు వారంతపు ఎక్స్‌పైరీలను నిలిపివేసే ప్రతిపాదనలేవీ లేవని.. ప్రచారంలో ఉన్నవి ఊహాజనితాలేనని బుధవారం సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే వివరణ ఇచ్చారు. తమ వద్దకు అటువంటి ప్రతిపాదన ఏమీ రాలేదని.. మీడియాలో వచ్చిన కథనాలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. అసలు ఇటువంటి సంస్కరణలను ఓ పద్ధతి ప్రకారం చర్చిస్తామని చెప్పారు. పాండే వివరణ తర్వాత బీఎస్‌ఈ షేర్లు వేగంగా కోలుకొన్నాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 1.50శాతం పుంజుకొని రూ.2405 వద్దకు చేరుకొన్నాయి.




వాస్తవానికి సెబీ వారంతపు ఎక్స్‌పైరీలను నిలిపివేస్తుందని.. దీన్ని రెండు వారాలకు ఒక్కసారిగా మారుస్తుందని మంగళవారం కొన్ని మీడియా సంస్థల్లో కథనాలు వెలువడ్డాయి. ఇది జరిగితే బీఎస్‌ఈ, నిఫ్టీ ఎక్స్‌పైరీలు మారిపోతాయి. ప్రస్తుతం బీఎస్‌ఈ మంగళవారం, నిఫ్టీ 50 కాంట్రాక్టులు గురువారం ముగుస్తున్నాయి. ప్రచారం జరిగినట్లు మారితే.. ఇవి ప్రతి రెండు వారాలకు ఒకసారి ముగుస్తాయి.

గత నెల సెబీ పూర్తికాల సభ్యుడు అనంత్ నారాయణన్ స్వల్పకాల ఎఫ్ అండ్ ఓ కాంట్రాక్టులు భారీ వాల్యూమ్‌ల్లో ట్రేడ్‌కావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వీటి నాణ్యత పెంచేందుకు గడువు పెంచే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. ఈ వ్యాఖ్యలు కూడా తాజా ప్రచారానికి ఊతం ఇచ్చాయి. ఇప్పటికే అప్షన్ ట్రేడింగ్‌లో సెబీ చాలా నియంత్రణలను తీసుకొచ్చింది. గతేడాది నవంబర్‌లో మార్కెట్లో హెచ్చుతగ్గులను అదుపు చేసేందుకు చాలా మార్పులు చేసింది.

ఈ ఏడాది జులైలో సెబీ నిర్వహించిన ఓ అధ్యయనంలో రిటైల్ ఇన్వెస్టర్ల నష్టాలకు సంబంధించిన కీలక డేటా వెల్లడైంది. ఒక్కో చిన్న మదుపుదారు ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో 2024 2025 ఆర్థిక సంవత్సరానికి రూ.1.06లక్షల కోట్లు నష్టపోయినట్లు తేలింది. ఇదే 202324 ఆర్థిక సంవత్సరంలో రూ.74,812 కోట్లుగా ఉంది.

# బాలకృష్ణను కలిసిన టాలీవుడ్ నిర్మాతలు

**హైదరాబాద్: టాలీవుడ్‌లో సినీ కార్మికుల వేతనాల పెంపుపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో పలువురు నిర్మాతలు.. నటుడు బాలకృష్ణ తో బుధవారం భేటీ అయ్యారు. ప్రసాద్ ప్రివ్యూ థియేటర్ వద్ద ఆయన్ను కలిసి తెలుగు చలన చిత్ర పరిశ్రమలో నెలకొన్న తాజా పరిణామాలను వివరించారు.**

ఈ సమావేశంలోని ముఖ్యాంశాలను నిర్మాత ప్రసన్న కుమార్ మీడియాకు వెల్లడించారు. “నిర్మాత బాగుండాలని బాలకృష్ణ ఎప్పుడూ చెబుతుంటారు. అదే విషయాన్ని మరోసారి గుర్తుచేశారు. వర్కింగ్ డేస్ ఎంత తక్కువ అయితే అంత మంచిదన్నారు. అవసరం మేరకే కార్మికులను తీసుకోవాలని సూచించారు. అటు నిర్మాతలు, ఇటు కార్మికులు.. అందరూ బాగుండేలా తాను చూసుకుంటానన్నారు. థియేటర్ల సమస్యలనూ దృష్టిలో పెట్టుకుని ఏడాదికి నాలుగు సినిమాల్లో నటిస్తానని చెప్పారు. సమస్యల పరిష్కారాలకు తనవంతు కృషి చేస్తానన్నారు” అని తెలిపారు.

ఈ పరిణామాలపై పలువురు నిర్మాతలు.. నటుడు చిరంజీవిని మంగళవారం కలిసిన సంగతి తెలిసిందే. ఫిల్మ్ ఫెడరేషన్- ఫిల్మ్ ఛాంబర్ సామరస్యంగా చర్చించుకోవాలని, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే తాను జోక్యం చేసుకుంటానని చెప్పినట్టు నిర్మాత సి. కల్యాణ్ తెలిపిన తెలిపారు.



# ఆ రెండు విషయాలే నాకు రక్షణ కవచాలు

ప్రస్తుతం సోషల్ మీడియా హవా నడుస్తోంది. వీళ్లు వాళ్లు అని తేడా లేకుండా ప్రతిఒక్కరిపై ట్రోలింగ్ జరుగుతూనే ఉంది. మెగాస్టార్ చిరంజీవి కూడా దీనికి బాధితులే. తాజాగా తనపై జరుగుతున్న ట్రోలింగ్ గురించి చిరు స్పందించారు. వాటి గురించి తాను మాట్లాకపోయినా తను చేసిన మంచే మట్లాడుతుందని అన్నారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఓ బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌కి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.సోషల్ మీడియాలో వచ్చే విమర్శలకు మీరు ఎందుకు స్పందించరు అని అందరూ అడుగుతుంటారు. నేనెప్పుడూ స్పందించను ఎందుకంటే నేను చేసిన మంచి కార్యక్రమాలు, నాపై అభిమానులు చూపించే ప్రేమే నాకు రక్షణ కవచాలు. నేను మాట్లాడాల్సిన అవసరం లేదు. నా మంచితనమే మాట్లాడుతుంది. మనల్ని ఎవరైనా మాటలు అంటే మన మంచే సమాధానం చెబుతుంది. అందుకే నేను ఎప్పుడూ దేనికీ స్పందించను. నాలాగే మంచి చేసే నా తమ్ముళ్లకు సాయంగా ఉంటాను. ఇతర దేశాల్లోని అభిమానులు కూడా నా మాటని స్పూర్తిగా తీసుకుని రక్తదానం చేస్తున్నారు. నా పేరుని మరింత ముందుకు తీసుకెళ్తున్నారు'

'కొన్నాళ్లుగా రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నాను. ఈ మధ్య ఓ నాయకుడు నన్ను అకారణంగా మాటలన్నారు. తర్వాత ఆయన ఓ ప్రాంతానికి వెళ్తే.. ఓ మహిళ ఆయనకు ఎదురు తిరిగింది. 'చిరంజీవి అన్నని మాటలు అనాలని ఎందుకు అనిపించింది?' అంటూ ఆమె ఎమోషనల్ అయింది. ఆమె వివరాలు కనుక్కొంటే.. చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ద్వారా ఆమె బిడ్డ ప్రాణాలు నిలిచాయని, అందుకే నేనంటే గౌరవం అని తెలిసింది. ఆ మాటలు విని నా హృదయం ఉప్పొంగింది' అని చిరంజీవి చెప్పుకొచ్చారు.



# మంచు మనోజ్ కొత్త చిత్రం.. టైటిల్ ఇదే

తాను ఇండస్ట్రీకి వచ్చి 21 ఏళ్లు అయిందని మంచు మనోజ్ తెలిపారు. ఇన్నేళ్లుగా తనపై ప్రేమాభిమానాలు చూపుతోన్న ప్రేక్షకులు ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా తన 21వ చిత్రాన్ని ప్రకటించారు. ఇంతమంది ఆదరణను సొంతం చేసుకోగలగడం తన అదృష్టమన్నారు.

ఇక తన 21వ చిత్రం 'డేవిడ్ రెడ్డి' అనే పేరుతో తెరకెక్కనున్నట్లు మనోజ్ తెలిపారు. హిస్టారికల్ యాక్షన్ ఫిల్మ్‌గా ఇది సిద్ధం కానుంది. హనుమరెడ్డి యక్కంటి దర్శకత్వంలో 1897 - 1922 మధ్య జరిగిన సంఘటనల ఆధారంగా రూపొందనుంది. త్వరలోనే దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించనున్నారు.

మేజర్ చంద్రకాంత్ సినిమాలో బాలనటుడిగా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు మంచు మనోజ్ ఆ తర్వాత 'దొంగ దొంగది' సినిమాలో హీరోగా నటించారు. చాలా విరామం తర్వాత ఇటీవల 'భైరవం'లో కనిపించారు. గజపతి వర్మగా ఆలయ భూములను, నగలను రక్షించే పాత్రలో మెప్పించారు. ఈ సినిమాతో నటుడిగా తనకు కొత్త జన్మ మొదలైందని తెలిపారు. ప్రస్తుతం 'మిరాయ్', వాట్ ది ఫిష్‌లో నటిస్తున్నారు.



# సంక్రాంతికి 'రాజాసాబ్'.. నిర్మాత ఏమన్నారంటే!

మారుతి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది రాజాసాబ్' . బిగ్గెస్ట్ హారర్ ఫాంటసీ ఫిల్మ్‌గా ఇది సిద్ధమవుతోంది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న విడుదల చేయనున్నట్లు గతంలో దర్శక నిర్మాతలు తెలిపారు. అయితే, కొన్ని రోజులుగా ఇది వాయిదా పడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అలాగే తాజాగా విడుదల చేసిన మాళవిక మోహనన్ పోస్టర్‌పై రిలీజ్ డేట్ లేకపోవడంతో ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిర్మాత టీజీ విశ్వప్రసాద్ దీని రిలీజ్‌పై మాట్లాడారు. షూటింగ్ దాదాపు పూర్తయిందని అన్నారు.

“ది రాజాసాబ్' సంక్రాంతికి వస్తే బాగుంటుందని ప్రభాస్ అభిమానులు కోరుకుంటున్నారు. వారి హీరోను పెద్ద పండగకు స్క్రీన్‌పై చూసుకోవాలని భావిస్తున్నారు. తెలుగు బిజినెస్ సర్కిల్ వారు కూడా ఈ సినిమాను జనవరి 9న విడుదల చేయాలని చెబుతున్నారు. కానీ, హిందీ ఆడియన్స్ మాత్రం డిసెంబర్ 5న విడుదల చేయాలని బలంగా కోరుతున్నారు . ఎందుకంటే డిసెంబర్‌లో అక్కడ పెద్ద సినిమాలు ఏవీ లేవు. అందుకని సంవత్సరం చివర్లో విడుదల చేయాలని అంటున్నారు”.



# రాజన్న మూవీ నటిపై కేసు నమోదు..!

ప్రముఖ నటి శ్వేతా మీనన్‌పై కేసు నమోదైంది. ఆమెపై కేరళ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. శ్వేతా మీనన్‌పై కేరళకు చెందిన మార్టిన్ మేనచేరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఆర్థిక లాభాల కోసం అడల్ట్ చిత్రాలు చేస్తోందని ఫిర్యాదు దారుడు ఆరోపించారు. దీంతో ఆమెపై కేసు నమోదు చేసిన కేరళ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.తన ఆర్థిక లాభం కోసం అడల్ట్ చిత్రాల్లో నటిస్తూ యువతను తప్పుదోవ పట్టిస్తోందని మార్టిన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ఆమె మీడియాలో ఇచ్చిన ఇంటర్వ్యూ వల్లే ఫిర్యాదు చేయడానికి కారణమన్నారు. డబ్బు కోసం తాను ఇలాంటి సినిమాలు చేయడానికి సిద్ధమేనని ఆమె చెప్పారని మార్టిన్ ఆరోపించారు. అడల్ట్ సినిమాల ద్వారా డబ్బులు సంపాదించడం ఐటీ చట్టం ప్రకారం తప్పు అని ఆయన పోలీసులను ఆశ్రయించారు. అయితే మొదట పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. ప్రస్తుతానికి ఈ కేసుకు సంబంధించి శ్వేత మీనన్ నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదు.కాగా.. శ్వేతా మీనన్.. 1991లో మలయాళ చిత్రం అనస్వరంతో తన నటనను ప్రారంభించింది. ఆ తర్వాత మలయాళ చిత్రాలతో పాటు పలు బాలీవుడ్, టాలీవుడ్ చిత్రాల్లోనూ కనిపించింది. టాలీవుడ్‌లో నాగార్జున నటించిన రాజన్న చిత్రంలో కనిపించింది. బాలీవుడ్‌లో అశోక, బంధన్, హంగామా, రన్, కార్పొరేట్, శాండ్‌విచ్, కిస్సే ప్యార్ కరూన్ లాంటి సినిమాల్లో నటించింది. ఆమె చివరిగా 2024లో విడుదలైన మలయాళ చిత్రం జాంగర్, వెబ్ సిరీస్ నాగేంద్రన్స్ హనీమూన్స్‌లో మెప్పించింది. ఇటీవలే ఎంకిలే ఎన్నోడు పారా అనే మలయాళ షోను కూడా శ్వేత హోస్ట్ చేసింది. మలయాళంలో రతినిర్వేదం, పలేరి మాణిక్యం, కలిమన్ను వంటి చిత్రాలలో తన నటనతో ఆకట్టుకుంది. సినిమాలతో పాటు ఆమె పలు వాణిజ్య ప్రకటనలు చేసింది.





ధనుష్, మృణాల్ డేటింగ్‌లో ఉన్నారంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఇటీవల తరచుగా వీళ్లిద్దరూ కలిసి కనిపించడం, ఈవెంట్‌లకు వెళ్తుండడంతో ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. తాజాగా ఈ స్టార్స్ ఇద్దరూ మరోసారి వార్తల్లో నిలిచారు. ధనుష్ సోదరీమణులు కార్తిక, విమల గీతను మృణాల్ కలిసినట్లు సోషల్ మీడియాలో టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే వీరిద్దరినీ సోషల్ మీడియాలో మృణాల్ ఫాలో అవుతున్నారు. వాళ్లు కూడా ఇటీవలే ఈ బ్యూటీ ఫాలోవర్స్ లిస్ట్‌లో చేరారు. దీంతో మృణాల్‌ను ధనుష్ తన కుటుంబసభ్యులకు పరిచయం చేశారని కూడా ఆంగ్ల మీడియా పేర్కొంది. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకూ నటీనటులిద్దరూ స్పందించకపోవడం గమనార్హం.

ఇటీవల జరిగిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' ఈవెంట్‌కు ధనుష్ హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో ఆయన మృణాల్‌తో చనువుగా ఉండడంతో ఆ వీడియోలు వైరల్‌గా మారాయి. ఆ తర్వాత ఆమె పుట్టినరోజు పార్టీలోనూ ఈ హీరో సందడి చేయడంతో వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారన్న ప్రచారం మొదలైంది.ఇక తాజాగా ఓ ఇంటర్వ్యూలో మృణాల్ తన కెరీర్‌కు సంబంధించిన కొన్ని విషయాల గురించి మాట్లాడారు. “నా కెరీర్‌లో ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయి. వాటిపై దృష్టిపెట్టాను. అవి పూర్తయిన తర్వాతే వాటి వివరాలు మీతో పంచుకుంటాను. ముందే మాట్లాడి వాటిని అపహాస్యం చేయలేను. ఎందుకంటే నేను దిష్టిని నమ్ముతాను. భవిష్యత్తు గురించి ముందే మాట్లాడడం నాకు నచ్చదు. ఈ ఏడాదిలో విడుదల కానున్న నా సినిమాల వివరాలను కూడా నేను ముందే పంచుకోను. ఏం జరుగుతుంది ఏం జరగదనే విషయాలు అందరికీ తెలుసు. అందుకే నా జీవితంలో జరిగే వాటి గురించి నిరంతరం ఆలోచించడం, మాట్లాడడం నాకు ఇష్టం ఉండదు” అని మృణాల్ చెప్పారు.



# రిలేషన్ వార్తల వేళ.. ధనుష్ కుటుంబంతో మృణాల్!

# భారత క్రికెట్ ఎవరి కోసమూ ఆగదు: సౌరభ్ గంగూలీ



స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ , విరాట్ కోహ్లి ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు సుదీర్ఘ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. దీంతో ఇంగ్లాండ్ టూర్‌లో టీమ్‌ఇండియా బ్యాటింగ్ విభాగం బలహీనపడుతుందని అంతా భావించారు. కానీ, పెద్దగా అనుభవం లేని మన కుర్రాళ్లు ఇంగ్లాండ్‌లో అదరగొట్టారు. సిరీస్‌లో అత్యధిక రన్స్ చేసిన టాప్ 6 బ్యాటర్లలో మనోళ్లే నలుగురు ఉన్నారు. ఇక, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 22తో ముగించడంతో భారత జట్టుపై ప్రశంసల జల్లు కురుస్తోంది. ఈ క్రమంలో టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత క్రికెట్ ఎవరి కోసం ఆగదని, స్టార్ క్రికెటర్లు లేని లోటును యువ ఆటగాళ్లు భర్తీ చేశారన్నాడు.'భారత క్రికెట్ ఎవరి కోసమూ ఆగదు. మన దేశంలో ఎంతోమంది ప్రతిభావంతులైన క్రికెటర్లున్నారు. ఇంగ్లాండ్ టూర్‌లో మన ఆటగాళ్లు బ్యాటింగ్ చేసిన తీరు అద్భుతం. భారత క్రికెట్ అలాగే ఉంది. సునీల్ గావస్కర్ రిటైర్ అయిన తర్వాత ఆ లోటును సచిన్ తెందూల్కర్ భర్తీ చేశాడు. అదే సమయంలో రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్, వీవీఎస్ లక్ష్మణ్ వచ్చారు. అనంతరం వచ్చిన విరాట్ కోహ్లి స్టార్ ఆటగాడిగా ఎదిగాడు. కోహ్లి తర్వాత యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్ స్టార్స్‌గా మారారు. భారత క్రికెట్‌లో చాలా ప్రతిభ ఉంది, అది పెరుగుతూనే ఉంటుంది. మన దేశవాళీ క్రికెట్ చాలా బలంగా ఉంది. ఐపీఎల్, భారత్ ఎ జట్టు, అండర్19 జట్టు రూపంలో మనకు చాలా వేదికలు ఉన్నాయి' అని గంగూలీ పేర్కొన్నాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌ను గెలవకపోయినప్పటికీ టీమ్‌ఇండియా ప్రదర్శనపై గంగూలీ సంతృప్తి వ్యక్తం చేశాడు. 'ఇంగ్లాండ్‌లో భారత్ అద్భుతంగా ఆడింది. మాంచెస్టర్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 0/2తో నిలిచిన టీమ్‌ఇండియా ఆ మ్యాచ్‌లో పుంజుకుని మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. తర్వాత ఓవల్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేసింది. శుభ్‌మన్ గిల్, గౌతమ్ గంభీర్‌కు అభినందనలు. భారత టాప్ ఆరుగురు బ్యాటర్లు కేఎల్ రాహుల్, గిల్, యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ అదరగొట్టారు' అని దాదా ప్రశంసించాడు.



## అందరికన్నా గౌతమ్ గంభీర్ మీదే ఎక్కువ ఒత్తిడి : మహమ్మద్ కైఫ్

తెందుల్కర్ అండర్సన్ ట్రోఫీ నేపథ్యంలో ఇంగ్లాండ్, టీమ్‌ఇండియా మధ్య అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ జరిగింది. ఇరుజట్లూ రెండు మ్యాచ్‌లు గెలవగా, ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది. దీంతో సిరీస్ 22తో సమమైంది. ఈ టూర్ నేపథ్యంలో అందరికన్నా భారత జట్టు కోచ్ గౌతమ్ గంభీర్ మీద ఎక్కువ ఒత్తిడి ఉందని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తన అభిప్రాయం వ్యక్తంచేశాడు. ఎందుకంటే ఈ టెస్ట్ సిరీస్‌కు ముందు సుదీర్ఘ ఫార్మాట్లో టీమ్‌ఇండియా ప్రదర్శన అంత గొప్పగా ఏం లేదు. ముఖ్యంగా స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. అలాగే ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలోనూ భారత జట్టు పేలవ ప్రదర్శన చేసింది. దీంతో ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌ను ఒకవేళ టీమ్‌ఇండియా కోల్పోయి ఉంటే.. గౌతమ్ గంభీర్ కోచ్ పదవి ప్రమాదంలో పడేదని పలువురు క్రికెట్ పండితులు విశ్లేషించారు.

'ఈ టూర్‌లో అందరికన్నా ఎక్కువ ఒత్తిడి టీమ్‌ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్ మీద ఉంది. ఒకవేళ టీమ్‌ఇండియా ఈ టెస్టులో (ఓవల్ మ్యాచ్) ఓడిపోయి ఉంటే.. అతడి మీద సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమై ఉండేది. మీమ్స్‌తో విరుచుకుపడేవారు. బహుశా అతడికి కోచ్‌గా ఇదే ఆఖరి టెస్ట్ మ్యాచ్ కూడా అయి ఉండేదేమో. కానీ అలా జరగలేదు. ఈ విషయంలో మనం అతన్ని ఎంత పొగిడినా తక్కువే' అని మహమ్మద్ కైఫ్ తన యూట్యూబ్ ఛానల్‌లో అన్నాడు.

అలాగే కోచ్‌గా గౌతమ్ గంభీర్ తీసుకున్న నిర్ణయాల మీద కూడా కైఫ్ మాట్లాడాడు. 'మనమంతా బుమ్రా గైర్హాజరీలో కుల్‌దీప్‌ను ఆడించాలన్నాం. కానీ గౌతమ్ గంభీర్ బ్యాటింగ్ డెప్త్ గురించి ఆలోచించాడు. అతడు ఎనిమిదో స్థానం వరకు బ్యాటర్లు ఉండాలని కోరుకున్నాడు. అతడి నిర్ణయమే సరైనదని నిరూపించుకున్నాడు. బ్యాటింగ్‌లో రవీంద్ర జడేజా , వాషింగ్టన్ సుందర్ అద్భుత ప్రదర్శనను మనం అంతా చూశాం. బ్యాటింగ్‌లో డెప్త్ ఉండటం వల్లే టీమ్‌ఇండియా భారీ స్కోర్లు చేయగలిగింది. దీని మూలంగానే భారతజట్టు ఈ సిరీస్‌ను డ్రా చేసుకోగలిగింది. గంభీర్ తీసుకున్న నిర్ణయం సరైనదే. ప్రస్తుతం టీమ్‌ఇండియా అంతగా అనుభవం లేని యువ ఆటగాళ్లతో నిండి ఉంది. ఈ నేపథ్యంలో కోచ్‌గా గంభీర్ మీద ఎంత ఒత్తిడి ఉండి ఉంటుందో నేను అర్థం చేసుకోగలను' అని మహమ్మద్ కైఫ్ పేర్కొన్నాడు.




# ఇంగ్లాండ్ టూర్.. టీమ్‌ఇండియా నేర్చుకోవాల్సిన పాఠాలు!

**అనుభవం లేని ఆటగాళ్లతో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన టీమ్‌ఇండియా ఐదు టెస్టుల సిరీస్‌ను 2-2తో ముగించింది. సీనియర్లు లేకుండా, కొత్త సారథి నాయకత్వంలో టీమ్‌ఇండియా ఈ స్థాయి ప్రదర్శన చేయడం గొప్ప విషయమే. అయితే, ఈ టూర్ ద్వారా భారత జట్టు కొన్ని పాఠాలను నేర్చుకోవాల్సిన అవసరముంది. అవేంటంటే?**



**ఓపెనర్లు ఓకే.. ఇద్దరూ కలిస్తేనే..**

ఇంగ్లాండ్ సిరీస్‌లో మన ఓపెనర్లు రాణించారు కానీ.. కలసికట్టుగా కాదు. కేఎల్ రాహుల్ (534), యశస్వి జైస్వాల్ (411) వ్యక్తిగతంగా మంచి ప్రదర్శనే చేశారు. కానీ, ఒకరు బాగా ఆడితే మరొకరు తొందరగా పెవిలియన్ చేరారు. ఐదు మ్యాచ్‌ల్లో ఒక్కసారి కూడా తొలి వికెట్‌కు 100కుపైగా భాగస్వామ్యం నమోదు కాలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. 6 ఇన్నింగ్స్‌ల్లో జట్టు స్కోరు 20 కూడా దాటకముందే భారత్ తొలి వికెట్ కోల్పోయింది. ఓపెనర్ల వ్యక్తిగత ప్రదర్శన కంటే భారీ భాగస్వామ్యాలు చేయాలి. దీనిపై జట్టు మేనేజ్‌మెంట్ దృష్టి సారించాలి.

**వన్ 'డౌన్' కావొద్దు**

ఈ సిరీస్‌లో వన్‌'డౌన్' ఇబ్బంది ఐదు టెస్టుల్లోనూ కొనసాగింది. మూడో స్థానంలో వచ్చిన సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ ఒక్కసారి కూడా భారీ ఇన్నింగ్స్ ఆడింది లేదు. మూడు మ్యాచ్‌ల్లో వన్‌డౌన్‌లో వచ్చిన సుదర్శన్ స్కోర్లు 0, 30, 61, 0, 38, 11. కరుణ్ నాయర్ రెండు మ్యాచ్‌ల్లో ఆ స్థానంలో వచ్చి చేసిన అత్యధిక స్కోరు 40. వీరు కుదురుకోరనిపిస్తే.. వేరే ఆటగాళ్లను ప్రయత్నించే ఆలోచన చేయాలి. లేదంటే దేశవాళీలో టాప్ ఆర్డర్‌లో బాగా ఆడిన అనుభవం ఉన్న రుతురాజ్ గైక్వాడ్, దేవ్‌దత్ పడిక్కల్, అభిమన్యు ఈశ్వరన్, నారాయణ్ జగదీశన్ లాంటి ఆటగాళ్లను పరిశీలించొచ్చు.

**మరో అగ్రెసివ్ వెపన్?**

టెస్టుల్లో రిషబ్ పంత్ ఆట గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పరిస్థితులెలా ఉన్నా ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగుతాడు. ముఖ్యంగా విదేశీ గడ్డపై టెస్టులంటే పూనకం వచ్చేస్తుంది. ఈసారి ఇంగ్లాండ్ పర్యటనలోనూ పంత్ అదే జోరు కొనసాగించాడు. తొలి టెస్టులో రెండు సెంచరీలు బాదేసిన అతను తర్వాత ఆడిన మూడు టెస్టుల్లోనూ రాణించాడు. ఆఖరి రెండు టెస్టుల్లో మాత్రం ఆ జోరు మిస్సయ్యాం. నాలుగో టెస్టు ఆడినా గాయం కారణంగా అగ్రెసివ్ పంత్‌ను చూడలేకపోయాం. ఇలాంటి అగ్రెసివ్ బ్యాటర్ జట్టులో మరొకరు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ వంటి దూకుడు ఉన్న యువ ఆటగాళ్లను ట్రై చేయొచ్చు. లేదంటే ఇప్పుడు రిజర్వ్ కీపర్‌గా ఉన్న ధ్రువ్ జురెల్ ఆ బాధ్యత తీసుకునేలా చేయాలి.

**ఆ ఒక్కడేనా?ఇంకా లేరా?**

టీమ్‌ఇండియా పేస్ ఆల్‌రౌండర్ల సమస్యను ఎప్పట్నుంచో ఎదుర్కొంటోంది. గత బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో రాణించిన పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి (Nitish Kumar Reddy).. ఇంగ్లాండ్ పర్యటనలో రాణిస్తాడు అనుకుంటే గాయం కారణంగా మధ్యలోనే దూరమయ్యాడు. నితీశ్ జట్టుకు దూరమైనప్పుడు భారత్‌కు పేస్ ఆల్‌రౌండర్ ప్రత్యామ్నాయం కనిపించలేదంటేనే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. కొంతమంది ఆటగాళ్లు దేశవాళీలో మెరుస్తున్నా.. జాతీయ జట్టు తలుపు తట్టలేకపోతున్నారు. ఈ క్రమంలో జట్టు యాజమాన్యం, బీసీసీఐ గట్టి ప్రయత్నాలే చేయాల్సి ఉంది. శార్దూల్ ఠాకూర్ రూపంలో ఓ పేస్ ఆల్‌రౌండర్ ఉన్నా.. అంతర్జాతీయ స్థాయిలో తేలిపోతున్నాడు. ఈ క్రమంలో 'నైట్ వాచ్‌మ్యాన్' ఆకాశ్ దీప్, హర్షిత్ రాణా పేర్లు చర్చకు వస్తున్నాయి.

**మూడో పేసర్ ఎవరు?**

టీమ్‌ఇండియాకు బుమ్రా, షమి, సిరాజ్ రూపంలో ముగ్గురు ప్రధాన పేసర్లున్నారు. అయితే, ఈ మధ్యకాలంలో ఈ ముగ్గురూ కలిసి ఆడిన సందర్భాలు తక్కువ. బుమ్రా, షమిలో ఎవరో ఒకరు గాయపడి జట్టుకు దూరమవుతున్నారు. ఈ క్రమంలో ఇంగ్లాండ్ పర్యటనలో షమి లేకపోవడంతో భారత్‌కు మూడో పేసర్ కష్టం కొనసాగింది. ఆ స్థానంలో వచ్చిన ప్రసిద్ధ్, ఆకాశ్‌దీప్ కొన్ని వికెట్లు తీసినా.. పరుగులు ఎక్కువగా ఇచ్చేశారు. ఈ నేపథ్యంలో మూడో పేసర్ స్థానంలో బలమైన బౌలర్ కావాలి. అప్పుడు మిగిలిన ప్రధాన పేసర్లపై పనిభారమూ తగ్గుతుంది. దీనికోసం ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్‌్షదీప్ సింగ్, ముకేశ్ కుమార్ లాంటివాళ్లపై ఫోకస్ పెట్టాలి

## సిరాజ్ యాటిట్యూడ్ ఇష్టం.. అతనికి దక్కాల్సిన క్రెడిట్ దక్కలేదు: సచిన్ తెందూల్కర్



భారత స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ యాటిట్యూడ్ తనకు ఇష్టమని దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందూల్కర్ అన్నాడు. నిలకడగా మంచి ప్రదర్శన చేస్తున్నా సిరాజ్‌కు తగిన గుర్తింపు దక్కడం లేదన్నాడు. ఇటీవల ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో హైదరాబాదీ పేసర్ అదరగొట్టిన సంగతి తెలిసిందే. ఓవల్‌లో జరిగిన చివరి టెస్టులో తొమ్మిది వికెట్లు తీసి భారత్ విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈ క్రమంలోనే సిరాజ్‌పై సచిన్ ప్రశంసలు కురిపించాడు.

'మైదానంలో సిరాజ్ స్పందించే తీరు అద్భుతం. అతని యాటిట్యూట్ నాకు చాలా ఇష్టం. ఎన్ని ఓవర్లు వేసినా అతనిలో అలసట కనిపించదు. ఒక ఫాస్ట్ బౌలర్ నిరంతరం ఇలా ఉత్సాహంగా ఉండటం ఏ బ్యాట్స్‌మెన్‌కీ నచ్చదు. చివరి రోజు వరకు అదే ఊపును కొనసాగించాడు. సిరీస్‌లో 1,000 కంటే ఎక్కువ బంతులు వేసిన తర్వాత కూడా ఆఖరి రోజు ఆటలో 145 కి.మీ. వేగంతో బౌలింగ్ చేశాడని వ్యాఖ్యాతలు చెప్పడం విన్నాను. అది సిరాజ్ పోరాట పటిమకు నిదర్శనం. గతంలో జరిగిన సిరీస్‌ల్లో కూడా నిలకడగా రాణించాడు. సిరాజ్ చేసిన ప్రదర్శనలను బట్టి చూస్తే అతనికి దక్కాల్సిన క్రెడిట్ దక్కలేదు' అని సచిన్ అభిప్రాయపడ్డాడు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో సిరాజ్ ఐదు మ్యాచ్‌ల్లోనూ ఆడాడు. ఇరుజట్లలో అన్ని మ్యాచ్‌లూ ఆడిన ఏకైక పేసర్ సిరాజే. ఏకంగా 185.3 ఓవర్లు బౌలింగ్ చేశాడు. మొత్తం 23 వికెట్లు పడగొట్టి భారత్ పేస్ దళానికి కీలకంగా మారాడు

# ఆలోచించి మాట్లాడాలి.. కర్మ ఎవ్వరినీ వదిలిపెట్టదు: అశ్విన్








తెందూల్కర్ అండర్సన్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్‌తో టీమ్‌ఇండియా అయిదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడింది. ఈ సిరీస్ 22తో భారత జట్టు డ్రా చేసుకోగలిగింది. అయితే, మాంచెస్టర్ వేదికగా జరిగిన నాలుగో టెస్టు మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో రిషభ్‌పంత్ రివర్స్ స్వీప్ ఆడుతూ గాయపడ్డాడు. అప్పుడు బంతి బలంగా పంత్ పాదానికి తాకింది. దీంతో నొప్పితో విలవిల్లాడిపోయాడు. చివరికి గోల్ఫ్‌కార్ట్‌పై మైదానాన్ని వీడాడు. తర్వాత మరుసటి రోజు అతికష్టం మీద బ్యాటింగ్‌కు వచ్చాడు. ఆఖరికి హాఫ్ సెంచరీ (54) చేసిన తర్వాత పెవిలియన్‌కు చేరాడు. రెండో ఇన్నింగ్స్‌లో అతడు బ్యాటింగ్‌కు రాలేదు.
ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్. టెస్ట్ క్రికెట్‌లో 'ఇంజూరీ రిప్లేస్‌మెంట్స్' ఉండేలా కొత్త నిబంధనలు రావాల్సిన అవసరం ఉందన్నాడు. గంభీర్ చేసిన ఈ వ్యాఖ్యలను ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్‌స్టోక్స్ కొట్టి పడేశాడు. ఆ ప్రతిపాదన హాస్యాస్పదంగా ఉందంటూ వ్యంగ్యంగా స్పందించాడు. అయితే ఓవల్‌లో జరిగిన అయిదో టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్టు అచ్చం ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంది. ఆ టీమ్ ఫాస్ట్ బౌలర్ క్రిస్ వోక్స్ భుజం గాయం కారణంగా ఇబ్బంది పడ్డాడు. అతడు మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగలేదు. కానీ రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు రాక తప్పలేదు. విజయానికి ఇంగ్లాండ్‌కు 20 పరుగులు అవసరమైన దశలో వోక్స్ ఒంటి చేత్తో బ్యాట్ పట్టుకుని ఆడటానికి వచ్చాడు.

విషయం గురించే రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడాడు. ''ఈ సిరీస్‌లో జరిగిన ఘటన గురించి నేను మాట్లాడాలనుకుంటున్నాను. 'కర్మ ఎవ్వరినీ వదిలిపెట్టదు. తక్షణమే బదులిస్తుంది' అనే అర్థంలో తమిళ సామెత ఉంది. మనం ఏమి విత్తితే.. ఆ పంటనే కోస్తాం. నాలుగో టెస్ట్ మ్యాచ్‌లో పంత్ గాయం మీద విలేకరులు టీమ్‌ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్‌ను ప్రశ్నలు అడిగారు. మ్యాచ్ మధ్యలో గాయపడిన ఆటగాళ్ల స్థానంలో మరొకరిని తీసుకునే వెసులుబాటు ఉంటే బాగుంటుందని అతడు స్పందించాడు. ఈ విషయాన్ని వారు బెన్‌స్టోక్స్ దగ్గర ప్రస్తావించినప్పుడు. అతడు అదో హాస్యాస్పదమైన ప్రతిపాదన అని తోసిపుచ్చాడు. క్రికెట్‌లో బెన్‌స్టోక్స్ శక్తిసామర్థ్యాలకు నేను వ్యక్తిగతంగా పెద్ద అభిమానిని. కానీ.. అతడు సమాధానం చెప్పే ముందు కాస్త ఆలోచించి మాట్లాడాలి' అని అశ్విన్ చురకలంటించాడు.
అలాగే సబ్‌స్టిట్యూట్స్ విషయంలో ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ మైఖేల్ వాన్ వ్యాఖ్యల గురించి ప్రస్తావించాడు. 'సబ్‌స్టిట్యూట్‌స్‌ను అనుమతించాలని మైఖేల్ వాన్ కూడా అన్నాడు. నేను ఏమి చెబుతున్నా అంటే.. ప్రత్యర్థి జట్టు మీద కాస్తైనా సానుభూతి చూపించాలి. రిషభ్ పంత్ స్థాయి శక్తిసామర్థ్యాలున్న ఆటగాడు ఇంగ్లాండ్ టీమ్ తరపున ఆడుతూ గాయడితే జట్టు పరిస్థితి ఎలా ఉంటుందో స్టోక్స్ ఓ సారి ఆలోచించాలి' అని రవిచంద్రన్ అశ్విన్ కుండబద్దలు కొట్టాడు.